జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php



చదవండి... చదివించండి... చందాదారులుగా చేరండి...

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాపాలన

న్యూస్ ఈజ్ రైట్

6-2-29/3/12, 3వ అంతస్థు,
దౌలత్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్ - 004

వివరాలకు సంప్రదించండి : 8886022523



సంపుటి 13 సంచిక 299 విశాఖపట్నం | గురువారం 15 జులై 2021 | 8 పేజీలు | వెల : 5.00


## ఆక్వారైతులకు..

# మంచి ధరలు అందాలి: జగన్

### చేపల వినియోగం పెంచడానికి హబ్‌లను ఏర్పాటు చేస్తున్నాం



అమరావతి,జులై 14, ప్రజాపాలన ప్రతినిధి: ఆక్వా రైతులకు మంచి ధరలు అందాలని, ఈ లక్ష్యాలను చేరుకోవడానికి రాష్ట్రంలో వినియోగం పెంచే దిశగా ఆక్వా హబ్‌లను ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. చేపల వినియోగం పెరగాలని, సరసమైన ధరలకు ప్రజలకు చేరాలని ఆయన అధికారులకు సూచించారు. పశుసంవర్ధకశాఖ, డెయిరీ, ఫిషరీస్ విభాగాలపై వైఎస్ జగన్ బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. చేపల రవాణా, నిల్వ తదితర అంశాల్లో అత్యుత్తమ ప్రమాణాలు పాటించాలన్నారు. ఆక్వా యూనివర్శిటీ ఏర్పాటుపై దృష్టిపెట్టాలనిఅధికారులను ఆదేశించారు. ఆక్వా లాబ్స్‌ను వినియోగించుకోవడంపై ప్రచారం, అవగాహన కల్పించాలని సీఎం జగన్ అధికారులకు సూచించారు. ఆక్వా రంగానికి సంబంధించి క్వాలిటీ చెకింగ్స్ ఎలా చేయించుకోవాలన్నదానిపై అవగాహన పెంచాలన్నారు. ఈ ల్యాబ్‌లను ఆర్బీకేలకు అనుసంధానం చేయాలని, ఆక్వా సీడ్, ఫీడ్‌ల విషయంలో ఎలాంటి కల్తీలు ఉండకూడదని తెలిపారు.

**కేజ్ ఫిష్ కల్చర్‌పై కార్యాచరణ ప్రణాళిక**

5 ఫిషింగ్ హార్బర్లు, 1 ఫిస్ ల్యాండ్ సెంటర్‌లో పనులు ప్రారంభమయ్యాయని అధికారులు సీఎం జగన్‌కు తెలిపారు. మిగిలిన చోట్ల కూడా పనులు ప్రారంభమయ్యేలా చూడాలని సీఎం అధికారులను ఆదేశించారు. కేజ్ ఫిష్ కల్చర్, మరీకల్చర్‌లపై దృష్టి పెట్టాలని, ఆదాయాలు బాగా పెరుగుతాయని తెలిపారు. కేజ్ ఫిష్ కల్చర్‌పై కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని, రైతులు, ఔత్సాహికులతో కలిసి ముందుకు సాగేలా ఒక ప్రణాళిక తీసుకు రావాలని తెలిపారు. పైలట్ ప్రాజెక్టు కింద మూడు చోట్ల కేజ్ ఫిష్ కల్చర్, మూడు చోట్ల మరీకల్చర్‌లను మొదలుపెట్టాలని తెలిపారు. వెటర్నరీ డిస్పెన్సరీల్లో హేతుబద్ధత ఉండాలని, ప్రతి గ్రామం, మండలంలో ఏం ఉండాలనేదాన్ని నిర్ధారించాలని అధికారులకు సీఎం సూచించారు.

**డిస్పెన్సరీలు ఆర్బీకేలతో అనుసంధానం**

హేతుబద్ధత ప్రకారం డిస్పెన్సరీలను పెట్టాలని, తర్వాత వాటిని మెరుగ్గా నిర్వహించాలని సీఎం వైఎస్ జగన్ తెలిపారు.

(మిగతా 2లో..)



## న్యాయశాఖపై కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం

న్యూఢిల్లీ, జులై 14, ప్రజాపాలన ప్రతినిధి: ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో బుధవారం సమావేశమైన కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. ముఖ్యంగా న్యాయశాలో చేపట్టే పలు అభివృద్ధి కార్యక్రమాలకు కేబినెట్ పచ్చ జెండా ఊపింది. రానున్న రోజుల్లో మొత్తం 9,000 కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు కేంద్ర న్యాయ శాఖ మంత్రి కిరణ్ రిజుజు పేర్కొన్నారు. తన అధికారిక ట్విట్టర్ ఖాతా ద్వారా దీనికి సంబంధించిన వివరాలు వెల్లడించారు. సెంట్రల్లీ స్పాన్సర్డ్ స్కీమ్ (సీఎస్ఎస్) ద్వారా ఈ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు.మొత్తం 3,800 కోర్టు హాళ్లు నిర్మించనున్నారట. ఇక 4,000 రెసిడెన్సియల్ యూనిట్లకు పచ్చ జెండా ఊపారు. వీటితో పాటు 1,450 టాయిలెట్ కాంప్లెక్స్‌లు, 1,450 లాయర్ హాల్స్, 3,800 డిజిటల్ కంప్యూటర్ రూంలకు అనుమతులిచ్చారు. అయితే వేటికి ఎంత మొత్తం కేటాయించారనే విషయం మాత్రం స్పష్టం చేయలేదు.

## పాత లెక్కలు తేల్చుకోవడానికా? పరామర్శించడానికా?: పేర్ని నాని



తాడేపల్లి,జులై 14, ప్రజాపాలన ప్రతినిధి:చంద్రబాబు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని రాష్ట్ర రవాణా, సమాచార శాఖ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) విమర్శించారు. చంద్రబాబు పరామర్శకు వచ్చి రాజకీయాలు మాట్లాడారని మంత్రి పేర్ని నాని పేర్కొన్నారు. పాత లెక్కలు తేల్చుకోవడానికి వచ్చారా? పరామర్శించడానికి వచ్చారా? అంటూ ఆయన ప్రశ్నించారు. చంద్రబాబు మాటలు విని ప్రజలు నవ్వుకుంటున్నారని మంత్రి ఎద్దేవా చేశారు. కరోనాను ఎదుర్కోవడంలో ఏపీ ప్రభుత్వం అద్భుతంగా పని చేస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను కేంద్రప్రభుత్వమే ప్రశంసించిందని మంత్రి పేర్ని నాని గుర్తు చేశారు. 20 నెలల్లోనే 97శాతం హామీలను సీఎం జగన్ నెరవేర్చారని అన్నారు.

**మాట ఇచ్చి తప్పడం చంద్రబాబు నైజం!**

మాట ఇచ్చి తప్పడం చంద్రబాబు నైజమని మంత్రి పేర్ని నాని దుయ్యబట్టారు. చంద్రబాబు ఇచ్చిన 600 హామీల్లో ఒక్కటైనా నెరవేర్చారా? అని ఆయన ప్రశ్నించారు. చంద్రబాబు నీళ్లిస్తే ప్రజలు ఎందుకు ఓడించారో? చెప్పాలన్నారు. చంద్రబాబు గిరిజనులకు ఒక్క మంత్రి పదవి కూడా ఇవ్వలేదని గుర్తు చేశారు. బెల్ట్ షాపులకు ప్రాణం పోసింది చంద్రబాబు కాదా? అని అడిగారు. దొంగలకు, వెన్నుపోటుదారులకు చంద్రబాబు ఆదర్శం అని దుయ్యబట్టారు. తెలంగాణ జల అక్రమాలపై చంద్రబాబు ఎందుకు మాట్లాడటం లేదు? అని మంత్రి పేర్ని నాని ప్రశ్నించారు.

## చిత్తూరు జిల్లాకు కృష్ణా జలాలు తీసుకొస్తాం: పెద్దిరెడ్డి



చిత్తూరు,జులై 14, ప్రజాపాలన ప్రతినిధి: కరువు ప్రాంతమైన చిత్తూరు జిల్లాకు సాగు, తాగు నీరు అందించాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించుకున్నారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. చిత్తూరు జిల్లా తంబాలపల్లి మల్లయ్య కొండలో ఉంటున్న పురాతన ఆలయం మల్లికార్జున స్వామి గుడి జీర్ణోద్ధరణ కార్యక్రమానికి మంత్రి పెద్దిరెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీడీపీ ఎన్ని కుట్రలు పన్నినా చిత్తూరు జిల్లాకు కృష్ణా జలాలు తీసుకొస్తామన్నారు. కుప్పంకు కూడా తాగు, సాగునీరు అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. వచ్చే శివరాత్రికి మల్లయ్య కొండ ఆలయ నిర్మాణాలు పూర్తి అవుతాయని అన్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గం తోపాటు జిల్లాలోని అన్ని ప్రాంతాలకు సాగు, నీరు అందిస్తామని తెలిపారు.ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి మాట్లాడుతూ..

(మిగతా 2లో..)

## తెలంగాణ వైఖరిపై సుప్రీంకోర్టులో ఏపీ ప్రభుత్వం పిటిషన్



అమరావతి: కృష్ణా జలాల్లో తెలంగాణ వైఖరిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

(మిగతా 2లో..)


స్నేహ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటి లిమిటెడ్

PAY BACK TO SOCIETY SNEHA CLUB | SNEHA MACS

గత 20 సం॥లు గా సమాజ మార్పుకోసం కంపెనీకి వచ్చే లాభాలను పేదప్రజల కనీస అవసరాల కోసం ఖర్చు చేస్తూ సోషల్ ఇంజనీరింగ్ చేస్తున్నాం.

SCHEDULE OF INTEREST RATES ON FIXED & R.D. ACCOUNTS

| Term | General | Senior Citizens |
|---|---|---|
| 180 Days - 1 Year | 7% | 7.5% |
| 1 Year - 2 Years | 8% | 8.5% |
| 2 Years - 3 Years | 9% | 9.5% |
| 3 Years - 5 Years | 10% | 10.5% |
| Above 5 Years | 11% | 11.5% |
| Savings Bank A/c | 5% | 5% |
| Recurring Deposit | 6% | 6.5% |

J.B. RAJU, IIS, vrs Ambassador
Dr. B.M. Vinod Kumar IFS Retd
Nerella Koteswara Rao DGM vrs BSNL
Dr. Guduri Seethamaha Lakshmi
M. Padma Sarma D.E. vrs BSNL
G. Kenny Bob
Dr. N. Venkateswarlu Principal Retd, Govt. Dental College
P.M. Raju. Chief Engineer, Retd
A. Punna Rao Chief Manager, Retd, Canara Bank
Arepally Rajendar DGM vrs, NTPC
S. Rama Krishna

Chairman : Dr. K. Siva Bhagya Rao, IRS vrs

CONTACT :
Hyderabad 76600 27682, 7842106355
Visakhapatnam 0891-2791205, 9246663046, 7660027696, 7660027664
Vijayawada 76600 27670, 900062111
Tirupathi 94400 77239
Bapatla 94403 20562
Ponnur 99089 91763
Cherukupalli 79958 56068
Karlapalem 76600 27676

H.No. 6-29/3/12, 3rd Floor, Daulat Plaza, Lakdikapul, Hyderabad - 500 004
E-mail : snehamacsltd@gmail.com


## విద్యార్థులకు వరంగా మారిన మమతాబెనర్జీ పథకం

- స్టూడెంట్ క్రెడిట్ కార్డులతో ఉన్నత చదువులకు అవకాశం కల్పిస్తున్న బెంగాల్ ప్రభుత్వం
- ఈ పథకం మన తెలుగు రాష్ట్రాలలో అమలు పరుస్తే మధ్యతరగతి విద్యార్థులకు వరంగా మారే అవకాశం



హైదరాబాద్(ప్రజాపాలన) :పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ విద్యార్థినీ విద్యార్థులకు ఒక అద్భుతమైన పథకాన్ని అందుబాటులోకి తెచ్చింది.చదువు కోవాలన్న ఆసక్తి ఉండి చదివే స్థోమత లేని విద్యార్థులకు స్టూడెంట్ క్రెడిట్ కార్డులు ప్రారంభించింది మమత ప్రభుత్వం. ఈ క్రెడిట్ కార్డు ద్వారా ప్రతీ విద్యార్థికి ఉన్నత చదువుల కొరకు పది లక్షల వరకు ఋణం పొందే అవకాశాన్ని మమతా తృణమూల్ ప్రభుత్వం ప్రారంభించింది.ఈ పథకానికి అర్హత వయస్సు 40 సంవత్సరాల వరకు పొడిగించడం విశేషం.అయితే ఈ రుణం పొందిన విద్యార్థి చదువు ముగించుకున్న తదుపరి 15 సంవత్సరాలలోపు తమ రుణాన్ని చెల్లించవలసి ఉంటుంది.ఇటువంటి పథకం మన రెండు తెలుగు రాష్ట్రాలలో లేకపోవడం,ఆ దిశగా ప్రభుత్వాలు కనీసం ఆలోచించకపోవడం గమనార్హం. మన తెలుగు రాష్ట్రాలలో మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి విద్యార్థులే అధికం.అటువంటి వారికి ఇలాంటి స్టూడెంట్ క్రెడిట్ కార్డు లాంటి పథకాలు ఎంతో గొప్పగా ఉపయోగపడతాయన్నది నిర్వివాదాంశం.ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలలో విద్యార్థులకు కొన్ని పథకాలు అమ్మఒడి,ఫీజు రీయింబర్స్ మెంట్ లాంటి పథకాలు అందుబాటులో ఉన్నా కూడా ఉన్నత చదువుల కొరకు కొంతమందికి మాత్రమే రుణాలు కల్పిస్తున్నాయి.

(మిగతా 2లో..)



## నాటు సారా విక్రయ దారులను పరుగెట్టించిన సెబ్ సి.ఐ.

**- ఒకరి అరెస్ట్, 1600లీటర్ల బెల్లంఊట, 200కిలోల నల్లజీలకర్ర స్వాధీనం**

**- 25కిలోల కరక్కాయలు, ఒక కేజీ నవాసారం కూడా స్వాధీనం**

చీరాల(ఒంగోలు) : ప్రకాశం జిల్లా చీరాల స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్బ్యూరో సర్కిల్ఇన్స్పెక్టర్ సోమయ్య, చీరాల ప్రాంతంలో అక్రమంగా నాటుసారా విక్రయిస్తున్న, తయారు చేస్తున్న వారికి, కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారు. అక్రమంగా నాటుసారా తయారీదారులతో పాటు, విక్రయదారులు సైతం బేంబేలెత్తి పోతున్నారు. కొందరైతే ఆ పనులు మానుకుని, చక్కగా కూలిపనులకు వెళుతున్నారు. నాటుసారా/కాపుసారా లేని సర్కిల్,చీరాల సర్కిల్ అనే లక్ష్యంతో సెబ్ సి.ఐ. సోమయ్య, తమ సిబ్బందితో విస్తృతంగా, రోజూ దాడులు చేస్తూనే ఉన్నారు. అనుమానాస్పద ప్రాంతాలలో నిఘా ను కొనసాగిస్తూనే ఉన్నారు. నిఘాలో భాగంగా అందిన విశ్వసనీయ సమాచారంమేరకు, బుధవారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. సెబ్ అధికారులు దాడులు చేస్తున్నారని తెలిసి కొందరు, సెబ్ అధికారులను చూసి మద్దతుదారులు మరికొందరు, దొరకకుండా ఉండేందుకు పరుగులెత్తి పారిపోయారు. అప్పటికే సినీఫక్కీ లో చేధించి, ఒకరిని పట్టుకొని సెబ్ సి.ఐ. అరెస్ట్ చేశారు.విజిలిపేటలో అక్రమంగా భూమిలో నిల్వచేసిన పదహారువందల లీటర్ల బెల్లం వూటను గుర్తించి, స్వాధీనం చేసుకోవడం జరిగింది.అదేవిధంగా ఇరవైలీటర్ల కాపు సారాయిని,రెండు వందల కేజీల నల్ల జీలకర్ర,ఇరవై ఐదు కేజీల కరక్కాయలను, కేజీ నవాసారంను కూడా స్వాధీనం చేసుకున్నామని, ఇందులో ప్రమేయం ఉన్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని వారిని స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఠాణా కు తరలించామని సి.ఐ. సోమయ్య తెలిపారు.

# కరివేపాకులా రఘురామకృష్ణంరాజు...



ఏలూరు, జూలై 14, :ఏదైనా తెగేదాకా లాగ కూడదంటారు. అలాగే అతి వెగటు కూడా పుట్టిస్తుందంటారు. ఇప్పుడు వైసీపీ ఎంపీ రఘురామ కృష్ణరాజు విషయంలో అదే జరుగుతుంది. ఏదైనా కొంతకాలమే సమయం నడుస్తుంది. అది ఎవరికైనా అదే వర్తిస్తుంది. రఘురామ కృష్ణరాజు ఎవరో తన వెనకున్నారన్న భ్రమలో ఉన్నారు. కాలం కలసి రాకపోతే వారు కనీసం ఇటువైపు కూడా చూడరు. ఆ సంగతి తెలియని ఆయన రోజురోజుకూ రెచ్చిపోతుంన్నారు. రాజుగారి లేఖలు, ఆయన వ్యవహారశైలి పట్ల సొంత నియోజకవర్గం నర్సాపురం పార్ల మెంటు ప్రజలతో పాటు సొంత సామాజికవర్గం సయితం అభ్యం తరం వ్యక్తం చేస్తున్నారు.వైసీపీ టిక్కెట్ మీద విజయం సాధించిన రఘురామ కృష్ణరాజు ఆ పార్టీ అధినేత వైఖరి నచ్చకపోతే బయటకు వచ్చేయాలి. తాను పుడింగిననుకుంటే మళ్లీ పోటీ చేసి గెలవాలి. అంతేతప్ప ఒక పార్టీ మీద గెలిచి అదే పార్టీని, ఆ పార్టీ అధినేతను పదేపదే విమర్శించడం సరికాదు. మొన్నటి దాకా రఘు రామ కృష్ణరాజుకు తెలుగుదేశం పార్టీ వెన్నుదన్నుగా ఉండేది. ఆ పార్టీ సోషల్ మీడియా సయితం రఘురామ కృష్ణరాజుకు అండగా నిలిచింది.కానీ రానురాను రఘురా మ కృష్ణరాజు వైఖరి విసుగు పుట్టిందేమో ఆయనను వదిలేశారు. ఇక భారతీయ జనతా పార్టీ అండ ఉందని రఘురామ కృష్ణరాజు భావిస్తున్నారు. పదే పదే కేంద్ర మంత్రులను కలుస్తున్నారు. కానీ బీజేపీ పరిస్థితి ఆయనకు తెలియంది కాదు. తమకు అవసరం లేదనుకుంటే కరివేపాకులా తీసిపారేస్తుంది. ఇప్పుడు బీజేపీకి రఘురామ కృష్ణరాజు అవసరం కన్నా జగన్ అవసరమే ఎక్కువగా ఉంది. అది తెలియని రఘురామ కృష్ణరాజు కాలు దువ్వుతున్నారు. అంతా సవ్యంగా జరిగితే మరో మూడేళ్లు మాత్రమే రఘురామ కృష్ణరాజు కు పదవి ఉంటుంది. ఆ తర్వాత పరిస్థితి ఏంటన్నది రఘురామ కృష్ణరాజు అర్థం కావాలి. ఆయన మామూలు రాజకీయ నేత కాదు. పారిశ్రామిక వేత్త కూడా. బ్యాంకు రుణాల ఎగవేత కేసులున్నాయి. సీబీఐ, ఈడీలు ఇప్పటికే సోదాలు నిర్వహించాయి. ఏమాత్రం జగన్ గట్టిగా నొక్కితే పాత కేసులు బీజేపీ ప్రభుత్వం తిరగదోడే అవకాశం లేకపోలేదు. కాలం కలసి రాకపోతే చుట్టుపక్కల ఎవ్వరూ ఉండరన్న సంగతిని రఘురామ కృష్ణరాజు గుర్తుంచు కోవాలని ఆయన సామాజికవర్గం పెద్దలే చెబుతుండటం విశేషం.

# రాజీ... నామాలేనా గంటా

విశాఖపట్టణం, జూలై 14, :ఎపుడో అయిదు నెలల క్రితం విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశం బయటకు వచ్చింది. అంతే ఉన్న ఉదుటున విశాఖ నార్త్ టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు రాజీనామా చేశారు. తనతో పాటు మొత్తం అధికార పార్టీ ఎమ్మెల్యేలు అంతా రాజీనామా చేయాలని కేంద్రం మీద వత్తిడి తేవాలని ఆయన కోరారు. అయితే గంటా శ్రీనివాసరావు చేసిన పనికి షాక్ తిన్న టీడీపీ కూడా ఆయనకు సహకరించలేదు. మరో వైపు వైసీపీ అయితే అసలు ఈ డిమాండ్ ని పట్టించుకోలేదు. మొత్తానికి స్టీల్ ప్లాంట్ ఇష్యూ మీద రాజీనామా చేసిన ఏకైక ఎమ్మెల్యేగా గంటా శ్రీనివాసరావు చరిత్రలో నిలిచారు. గంటా శ్రీనివాసరావు అంతటితో ఊరుకోలేదు. స్పీకర్ తమ్మినేని సీతారామ్ ఉన్న ఆముదాలవలసకు వెళ్ళి మరీ తన రాజీనామాను ఆమోదించుకోవాలి వత్తిడి తెచ్చారు. అది జరిగి కూడా నాలుగు నెలలు అయింది. కానీ ఇప్పటిదాకా గంటా శ్రీనివాసరావు రాజీనామా ఆమోదం పొందలేదు. అయితే స్పీకర్ ఫార్మెట్లో ఇచ్చిన ఆయన రాజీనామా అలాగే ఉంది. దాంతో గంటా శ్రీనివాసరావు కూడా సైలెంట్ అయ్యారు. ఈ లోగా కరోనా రెండవ దశ వీరవిహారం చేయడంతో అంతా ఆ ఊసు మరిచారు. అయితే ఇపుడు కేంద్రం దూకుడు పెంచేసింది. విక్రయ ప్రక్రియను తొందరలోనే పూర్తి చేయాలనుకుంటోంది. విశాఖకు జాతీయ వామపక్ష నాయకులు వస్తున్నారు. విశాఖ ఉక్కు విషయంలో ప్రైవేటీకరణ చేయవద్దని కూడా వారు గట్టిగా కోరుతున్నారు. ఉక్కు కార్మికులు అయితే భారీ ర్యాలీలు నిర్వహించి మరీ కేంద్రాన్ని హెచ్చరిస్తున్నారు. మరో వైపు ఢిల్లీ వెళ్ళి ఉద్యమించడానికి కూడా రంగం సిద్ధమవుతోంది. ఇంత జరుగుతున్నా కూడా గంటా శ్రీనివాసరావు మాత్రం ఎక్కడా ఒక్క మాట లేకుండా అలాగే ఉన్నారు. ఆయన కనీసం ఉక్కు పోరాట శిబిరం వైపుగా కూడా తొంగి చూడడంలేదు. మరి ఉక్కు కోసమే రాజీనామా చేశాను అని చెప్పిన ఆయన ఎందుకిలా ఉన్నారు అన్నది కార్మికులకే అర్ధం



కావడంలేదు.గంటా శ్రీనివాసరావు పొలిటికల్ స్టంట్ కోసమే విశాఖ ఉక్కుని వాడుకున్నారా అన్న చర్చ కూడా ఉందిపుడు. ఉక్కు పోరాట యోధుడిగా కలరింగ్ ఇచ్చిన ఆయన క్లైమాక్స్ సీన్ లో కనిపించకపోవడం ఏంటి అని కూడా అంటున్నారు. ఇంకో వైపు చూస్తే ఉక్కు ఎటూ ప్రైవేట్ పరం అవుతుందని తెలిసే గంటా శ్రీనివాసరావు ఇలా మిన్నకున్నారా అన్న మాటా ఉంది. ఏది ఏమైనా ఆదికి ముందే అరవీర భయంకర వీరుడిగా అవతారం ఎత్తిన మాజీ మంత్రి సరైన టైమ్ లో కామప్ అయిపోవడం ద్వారా తన ఇమేజ్ ని బాగా తగ్గించేసుకున్నారు అన్న ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి

## తెలంగాణ వైఖరిపై సుప్రీం కోర్టులో ఏపీ ప్రభుత్వం పిటిషన్

(మొదటి పేజీ తరువాయి)

ఏపీకి దక్కాల్సిన న్యాయమైన వాటాకు తెలంగాణ గండి కొడుతోందని పిటిషన్ దాఖలు చేసింది. ఈ సందర్భంగా కృష్ణా రివర్ మేనేజ్మెంట్ బోర్డు పరిధిని నోటిఫై చేయాలని సర్వోన్నత న్యాయస్థానానికి విజ్ఞప్తి చేసింది.అదే విధంగా... తెలంగాణ సర్కార్ జూన్ 28న ఇచ్చిన జీవోను రద్దు చేయాలని కోరింది. ఈ మేరకు.. "తెలంగాణ ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తోంది. తాగు, సాగు నీటి జలాలు దక్కకుండా ప్రజల హక్కును హరిస్తోంది. కృష్ణా జలాల పంపిణీ అవార్డును తెలంగాణ ఉల్లంఘిస్తోంది. విభజన చట్టాన్ని కూడా తెలంగాణ ఉల్లంఘిస్తోంది" అని ఏపీ ప్రభుత్వం తన పిటిషన్లో పేర్కొంది.

# జనం నాడి పట్టుకొనే పనిలో తమ్ముళ్లు

గుంటూరు, జూలై 14,:తమ్ముళ్లకు సూచన అంటూ.. కొన్ని విశ్లేషణలు వస్తున్నాయి. వీటిలో ప్రధానంగా.. ఆసక్తిగా ఉన్నది ఏంటంటే.. జగన్మీద కన్నా.. జనం మీద దృష్టి పెట్టాలనే విషయం. ఎందుకంటే.. ప్రతిపక్షాలు ఎన్ని విమర్శలు చేసినా.. సీఎం జగన్ ఎక్కడా పట్టించుకోవడం లేదు. ప్రజలకు తాను ఏం చేయాలని అనుకున్నాడో.. అది చేస్తున్నాడు. ఎంత మొత్తం నిధులు ఇవ్వాలని అనుకున్నాడో.. అంత మొత్తం ఇస్తున్నారు. దీంతో ప్రజల్లో ముఖ్యంగా పేదలు, దిగువ మధ్యతరగతి.. మహిళలు, చేతి వృత్తుల వారిలో జగన్పై సానుభూతి మరింత పెరుగుతోంది. సో.. తను పెట్టుకున్న వచ్చే ఎన్నికల టార్గెట్ నెరవేర్చుకునేందుకు జగన్ ఇలా వ్యవహరిస్తున్నారని పరిశీలకులు పేర్కొంటున్నారు. జగన్ ఓటు బ్యాంకు రాజకీయాల దెబ్బతో టీడీపీ అతలాకుతలం అయిపోతోంది.ఈ కారణంగానే జగన్.. ప్రతిపక్షాల నుంచి ఎన్ని విమర్శలు వచ్చినా పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు. ఇదే సమయంలో వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేస్తామని.. మాకు మంత్రి పదవులు ఖాయమని అనుకుంటున్న టీడీపీ నేతలకు మాత్రం.. ఈ తరహా వ్యూహం కనిపించడం లేదు. అంటే.. ఎంతసేపూ.. జగన్ను టార్గెట్ చేస్తున్నారు. నాయకుడు ఏ రూట్లో వెళుతున్నాడో.. ఆ పార్టీ నాయకులు అదే ఫాలో అవుతున్నారు. జగన్ రాష్ట్రానికి ఎలాంటి పెట్టుబడులు తీసుకురావడం లేదు. ఆయన వల్ల రాష్ట్రం అభివృద్ధి చెందడం లేదు. ప్రత్యేక హోదా లేదు.. ఆయన చేతకాని సీఎం. ఇలా.. అనేక వ్యాఖ్యలు సంధిస్తున్నారు. సీఎం జగన్ను టార్గెట్ చేశామని.. ఆయన ప్రజల్లో ఇమేజ్ కోల్పోతున్నారని.. టీడీపీ నేతలు చెప్పుకొంటున్నారు. కానీ, వాస్తవంలోకి వస్తే.. ప్రజలు.. ఎవరూ కూడా రాష్ట్ర అభివృద్ధి కేవలం జగన్తోనే ఆగిపోయిందని.. ఆయన వల్లే పెట్టుబడులు రాకుండా పోయాయని అనుకునే పరిస్థితి కనిపించడం లేదు. గతంలో ప్రత్యేక హోదా విషయంలో చంద్రబాబు అనుసరించిన తీరును ప్రజలు ఇప్పటికీ మరిచిపోలేదు. అదేసమయంలో గతంలో అమలు చేసిన పథకాల్లో రెండు మూడు వేలకు మించి ఒకే సారి పది వేలు, 15 వేలు. 18 వేల చొప్పున ఖాతాల్లో పడిన దాఖలా కూడా లేదు. దీంతో ప్రజలకు జగన్పై వ్యతిరేకత లేకపోగా.. ఆయనపై సానుభూతి పెరిగిందనేది వాస్తవం అంటున్నారు పరిశీలకులు. ఈ క్రమంలో టీడీపీ నేతలు.. జగన్ను టార్గెట్ చేస్తూ..నే మరోపక్క, జనం నాడిని పట్టుకునే ప్రయత్నం చేయకపోతే.. ఉపయోగం ఉండదని అంటున్నారు. మరి ఇప్పటికైనా.. వాస్తవం ఏంటో తమ్ముళ్లు తెలుసుకుంటారో లేదో చూడాలి.

## ఆక్వారైతులకు..

## మంచి ధరలు అందాలి: జగన్

(మొదటి పేజీ తరువాయి)

డిస్పెన్సరీలు ఆర్బీకేలతో అనుసంధానం చేయాలన్నారు. అయితే కొన్ని డిస్పెన్సరీలు లేని మండలాలు కూడా ఉన్నాయని అధికారులు ముందు మ్యాపింగ్ చేసి తర్వాత వాటిని ఏర్పాటు చేయడంపై దృష్టి పెట్టాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పశువుల ఆస్పత్రుల్లో నాడు-నేడుపై కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. నాడు-నేడులో భాగంగా నిర్మాణాలు, మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలను ముందు నిర్ధారించుకోలన్నారు. తర్వాత పనులు ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం జగన్ ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశానికి మంత్రి సీదిరి అప్పలరాజు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## ముందుకు సాగని జగనన్న కాలనీలు

విజయవాడ, జూలై 14, :జగనన్న స్మార్ట్ సిటల పేరిట ప్రభుత్వమే మౌలిక వసతులు కల్పించి "నో లాస్- నో ప్రాఫిట్" కింద మధ్య తరగతి ప్రజలకు ఇంటి స్థలాలను అమ్మాలని నిర్ణయించింది. లే అవుట్లకు నగరానికి మూడు కిలోమీటర్లలోపు దూరంలో భూములు కొనుగోలు చేయాలని భావించినప్పటికీ ప్రధాన నగరాలకు దగ్గర్లో అందుబాటులో భూములు లేని పరిస్థితి. విజయవాడ, గుంటూరు, తిరుపతి, విశాఖ, నెల్లూరు, ఒంగోలు నగరాలతో పాటు పలు మున్సిపాల్టీల్లో కూడా భూములు సేకరించడం అధికార యంత్రాంగానికి కష్టంగా ఉంది. భూముల సేకరణ ప్రక్రియ ఆలస్యమయ్యే కొద్దీ జగనన్న స్మార్ట్ సిటీలో లే అవుట్లు వేసే ప్రక్రియ మరింత వెనక్కు పోతోంది. ఒక్కో మున్సిపాల్టీలో 25నుంచి 150 ఎకరాల్లో వెంచర్ప్ వేయాలని ప్రభుత్వం భావించింది. భూములు సేకరించేందుకు ఆయా జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్రెడ్డి జిల్లా కలెక్టర్ల సమీక్షా సమావేశంలో అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా భూములు లభ్యత కాక పోతుండటంతో జిల్లా స్థాయి అధికారుల పరిస్థితి "కరవమంటే కప్పకు కోపాం విడవమంటే పాముకు కోపం" అనే చందాన తయారైంది. "నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు" పథకంలో అర్హులైన పేదలకు ఒక సెంటు స్థలం ఇవ్వడానికే భూ సేకరణ కష్టంగా మారగా, నగరం, మున్సిపాలిటీ పరిధిలో భూములు సేకరించడం తలకు మించిన భారమని అధికారులంటున్నారు.ఏప్రిల్ నెలలో ఈ పథకానికి రూపకల్పన జరగ్గా ఈ పథకానికి సంబంధించి ఒక్క అడుగుకూడా ముందుకు పడలేదని సమాచారం. అర్హులైన మధ్యతరగతి వర్గాల ప్రజలకు సంబంధించి ఎంత మందికి లే అవుట్లలో ప్లాట్లు అవసరమో గుర్తించేందుకు వార్డు వాలంటీర్లు, టౌన్ప్లానింగ్ సెక్రటరీ విభాగంలోని సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి డిమాండ్ను ప్రభుత్వానికి నివేదిక ఇచ్చి రెండున్నర నెలలు దాటినప్పటికీ రాష్ట్ర వ్యాప్తంగా ఏ ఒక్క నగరంలోకూడా లే అవుట్లకు శ్రీకారం చుట్టిన దాఖలాల్లేవు. ప్రభుత్వం అనుకున్నట్లు భూములు కొనుగోలు ప్రక్రియ పూర్తయితే ఎంఐజి(మధ్య తరగతి లే అవుట్ పథకం)లోని మూడు కేటగిరీలకు వారి వార్షిక ఆదాయాన్ని బట్టి లే అవుట్లలో ప్లాట్లను కేటాయిస్తారు. కనీసం దసరా నాటికైనా ప్లాట్లు మధ్యతరగతి ప్రజలకు అందుబాటులోకి వస్తాయో లేదోననే చర్చ ప్రజల్లో నడుస్తోంది.

# ఏపీ వైపు కన్నెత్తి చూడని టాలీవుడ్

విజయవాడ, జూలై 14, :మొత్తానికి రెండేళ్ళ తరువాత జగన్ కి తత్వం బోధపడిందిట. టాలీవుడ్ ని ఎంత పిలిచినా ఏపీకి రావడం లేదు. పైగా వారంతా తారలు. ఎక్కడో సదూర ఆకాశంలో అలా మెరుస్తూ ఉంటారు. వారు అన్నింటికీ అతీతులు. దాంతో ఏపీ సీఎం గా జగన్ బాధ్యతలు చేపట్టాక ఒకే ఒక్క భేటీ తప్ప ఏపీలో తెలుగు సినిమా పరిశ్రమ అభివృద్ధి విషయంలో అడుగు ముందుకు పడలేదు. పైగా ఎంతసేపూ కేసీయార్ కి బాసటగా నిలుస్తూ హైదరాబాద్ కే ప్రయారిటీ ఇవ్వడం కూడా జగన్ కి ఆగ్రహం తెప్పించింది అంటున్నారు. టాలీవుడ్ ని దారిలోకి తెచ్చుకోవడం కోసమే జగన్ వకీల్ సాబ్ టికెట్ల విషయంలో అతి పెద్ద షాక్ ఇచ్చారని అంటున్నారు. ఇప్పటిదాకా పెద్ద హీరోల సినిమాలకు ఇష్టారాజ్యంగా సినిమా టికెట్ల రేట్లు పెంచుకునే ఛాన్స్ ఉండేది. దాన్ని ప్రభుత్వం అనుమతించింది. దాంతో రాష్ట్ర ప్రభుత్వ పెద్దలతో సంబంధం లేకుండా తమ కలెక్షన్ల పంట పండించుకుంటున్నారు. అదే సమయంలో ఏపీ సర్కార్ అంటే పెద్దగా పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. దీనికి చెక్ పెడుతూ జగన్ ప్రభుత్వం తీసుకున్న ఒకే ఒక చర్యతో ఇపుడు టాలీవుడ్ వెంట పడుతోంది.తాజాగా ఏపీ సర్కార్ ఒక జీవో విడుదల చేసింది. దాని ప్రకారం చూస్తే పెద్ద బడ్జెట్ సినిమాల విషయంలో రేట్లు పెంచుకోవడానికి అనుమతి ఇవ్వాలంటే ప్రభుత్వ పెద్దలని తప్పనిసరిగా కలవాల్సిందే. ఇది ప్రతీ సినిమా విషయంలోనూ చేయాల్సిందే. అంటే ఏ హీరోకు ఆ హీరో ఇక మీదట సర్కార్ పెద్దలతో బాగా టచ్ లో ఉండాలన్న మాట. లేకపోతే మామూలు ధరలే అమలవుతాయి. ఇక టాలీవుడ్ లో చూసుకుంటే అన్నీ హై బడ్జెట్ మూవీస్ గా వస్తున్నాయి. పాన్ ఇండియా సినిమాలు కూడా ఉన్నాయి. దాంతో జగన్నామస్మరణతో టాలీవుడ్ ఇపుడు తరిస్తోంది.జగన్ అపాయింట్మెంట్ కోసం ఇపుడు టాలీవుడ్ బడా బాబులు క్యూ కడుతున్నారుట. సినిమా పరిశ్రమ సమస్యలు చర్చించాలి అని అర్జీలు పెట్టుకుంటున్నారు. అయితే జగన్ ఇపుడు అపాయింట్మెంట్ ఇచ్చినా తాను అనుకున్న దాని నుంచి వెనక్కు పోరు అంటున్నారు. బడా సినిమాలు, పెద్ద హీరోల విషయంలో జీవో ఆధారంగానే రేట్ల పెంపు అమలుకే సర్కార్ కట్టుబడి ఉందని అంటున్నారు. అలా చేస్తేనే టాలీవుడ్ ఏపీ వైపు చూస్తుంది. ఇక్కడ జనాలతో కనెక్షన్లు కూడా బాగుంటాయని భావిస్తున్నారుట. మొత్తానికి జగన్ గట్టి నిర్ణయంతో టాలీవుడ్ విలవిలలాడుతోంది మరి.

## చిత్తూరు జిల్లాకు కృష్ణా జలాలు తీసుకొస్తాం: పెద్దిరెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

అభివృద్ధి సంక్షేమం గురించి విమర్శలు చేస్తున్న ప్రతిపక్షాలు ఒకసారి తంబళ్లపల్లె కొచ్చి చూడాలని అన్నారు. సీఎం జగన్ చేస్తున్న అభివృద్ధిని చూసి ప్రతిపక్షాలు ఓర్వలేక పోతున్నామని మండిపడ్డారు. రూ. 3కోట్లతో ఈ గుడిని ఆధునీకరణ చేయనున్నారు. అలాగే ఆరు కోట్ల రూపాయలతో రోడ్డు వసతిని కల్పించనున్నారు. మల్లయ్య కొండలో మల్లికార్జున స్వామి గుడికి భూమి పూజ జరిగిన కార్యక్రమంలో మంత్రితో పాటు ఎంపీ రెడ్డప్ప ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, చింతల రామచంద్రారెడ్డి, నవాబ్ భాష, శ్రీనివాసులు, వెంకటేశ్ గౌడ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు వరంగా మారిన మమతాబెనర్జీ పథకం

(మొదటి పేజీ తరువాయి)

అలాంటిది ఇలా స్టూడెంట్ క్రెడిట్ కార్డులు లాంటి గొప్ప పథకాన్ని మన రాష్ట్రాలలో అమలు పరుస్తే ఎంతో మంది విద్యార్థులు ఉన్నత చదువులు చదివే అవకాశం కల్పించిన వారవుతారని ప్రజానీకం కోరుకుంటున్నారు.

## టీడీపీ నేత బచ్చుల అర్జునుడికి గుండెనొప్పి

విజయవాడ: ఎమ్మెల్సీ, గన్నవరం టీడీపీ ఇన్ఛార్జ్ బచ్చుల అర్జునుడికి గుండెనొప్పి వచ్చింది. టీడీపీ అధినేత చంద్రబాబు పర్యటనలో ఉండగానే.. ఒక్కసారిగా నొప్పిరావడంతో విజయవాడకు టీడీపీ శ్రేణులు తరలించారు. రమేష్ ఆస్పత్రిలో బచ్చులకు వైద్యులు అంజియోప్లాస్ట్ చేశారు. బచ్చుల ఆరోగ్యం నిలకడగా ఉందని రమేష్ ఆస్పత్రి వైద్యులు చెబుతున్నారు.

# సచివాలయాలు, ఆర్.బీ.కే.లు, హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణ స్థితిగతుల పై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్



ఒంగోలు జులై 14 (ప్రజా పాలన) క్షేత్రస్థాయి లో చేపడుతున్న ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులు ఇప్పటికీ ప్రారంభంకానిచోట వారంలోగా శంకుస్థాపన జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. సంతనూతలపాడు, పర్చూరు, చీరాల నియోజకవర్గాలలోని సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వై.ఎస్.ఆర్. విలేజ్ హెల్త్ క్లినిక్లు, బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్ల నిర్మాణ స్థితిగతుల పై బుధవారం ప్రకాశం భవనం లోని కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలు లో కలెక్టర్ సంబంధిత అధికారుల తో సమీక్ష నిర్వహించారు.

కలెక్టర్ మాట్లాడుతూ సెప్టెంబరు నెలాఖరు లోపు ఈ భవనాలన్నీ పూర్తికావాలని ముఖ్యమంత్రి వై.ఎన్. జగన్మోహన్ రెడ్డి ఆదేశించారు. ఈ పనులకు అధిక ప్రాధాన్యం ఇచ్చి, పూర్తయ్యేలా పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. జిల్లాలో వీటి కోసం చేస్తున్న ఖర్చు, నిర్మాణ పురోగతి పై పంచాయతీ రాజ్ ఎస్.ఇ. కొండయ్య కలెక్టరుకు వివరించారు. ఈ మూడు నియోజకవర్గాల్లో 2020-21 ఆర్థిక సంవత్సరం లో సుమారు. 75 కోట్ల అంచనా వ్యయం తో వీటి నిర్మాణాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం సంతమాతలపాడు నియోజకవర్గం లో 36 శాతం పనులు, చీరాల నియోజకవర్గం లో 2 పనులు పర్చూరు నియోజకవర్గం లో 14 శాతం పనులు పూర్తయ్యాయని చెప్పారు. ఆయా మండలాల్లో వీటి నిర్మాణ పనులు వేగం తగ్గడాని కి కారణాల పై సంబంధిత ఏ.ఇ.లు కలెక్టరు కు వివరించారు. కోర్టు కేసుల వల్ల కొన్నిచోట్ల పనులు ఆగిపోయాయని, మరికొన్ని చోట్ల నిర్మాణ పనులు చేపట్టడాని కి కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని వారు తెలిపారు. గతం లో చేపట్టిన నిర్మాణాలు, -సిమెంటు రోడ్డులకు ప్రభుత్వం ఇప్పటికీ బిల్లులు చెల్లించకపోవటం కూడా ఒక కారణంగా తమ దృష్టికి వచ్చిందని వారు చెప్పారు. దీనిపై కలెక్టరు స్పందిస్తూ ప్రస్తుతం క్షేత్రస్థాయి లో చేపట్టిన ఈ భవనాల నిర్మాణ పనులకు నిధుల సమస్య లేదన్నారు. పనులు వేగంగా జరిగిన చోట ప్రభుత్వం బిల్లులు చెల్లించిన ఉదంతాలను కాంట్రాక్టర్లకు వివరించండి. ఈ పనులు వెంటనే ప్రారంభమయ్యే లా స్థానిక ప్రజా ప్రతినిధుల సహకారం తీసుకోవాలని, ఈ దిశగా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ టి.ఎస్. చేతన్ కు కలెక్టర్ సూచించారు. ఈ భవనాలకు భూసమస్యలు ఉంటే వెంటనే వాటికి పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ జె. వెంకట మురళి రెవిన్యూ మరియు రైతు భరోసా కి ఆయన సూచించారు. వీటి నిర్మాణాలకు అవసరమైన ఇసుక, సిమెంటు లభ్యత విషయంలోఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నిర్దేశిత గడువు లోగా నిర్మాణాలు, -పూర్తయ్యే లా అధికారులు నిరంతరం పర్యవేక్షస్తూ పనులను పరిశీలిస్తూ ఉండాలని, కలెక్టర్ మార్గనిర్ధకం చేశారు. క్షేత్రస్థాయి లో తానుకూడా పర్యటించి, వీటి నిర్మాణ పురోగతిని పరిశీలిస్తానని కలెక్టర్ ఈ సందర్భంగా చెప్పారు. ఈ కార్యక్రమం లో ఒంగోలు ఆర్.డి.ఓ. ప్రభాకర రెడ్డి, పంచాయతీ రాజ్ డి.ఇ.లు, కె.ఇ.లు. ఏ.ఇ.లు. పాల్గొన్నారు.



## పల్లె ప్రగతిపై సమీక్ష

ఏలూరు ప్రజా పాలన ప్రతినిధి : పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని గారి క్యాంప్ ఆఫీస్ లో హౌసింగ్ పనుల ప్రగతిపై ఏలూరు క్యాంపు కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని గారు మరియు దెందులూరు శాసనసభ్యులు కోటార్ అబ్బయ్య చౌదరి గారు జిల్లా జాయింట్ కలెక్టర్ (హౌసింగ్) మరియు అధికారులతో సమీక్ష కార్యక్రమంలో పాల్గొన్న దెందులూరు శాసనసభ్యులు కొట్ పాల్గొన్నారు.

## ప్రకాశం జిల్లా ఎస్పీగా మల్లికాగార్గ్ నియామకం

**- ప్రకాశం జిల్లాలో తొలి మహిళా ఎస్పీ**



Smt. Malika Garg, IPS

ఒంగోలు : ప్రకాశం జిల్లా పోలీస్ అధికారి నియామకం విషయంలో, గత కొద్ది రోజులుగా అనేక పేర్లు వినిపించాయి. అయితే రెండు రోజుల క్రితం ప్రకాశం జిల్లా ఎస్పీ సిద్దార్థ కౌశల్ ని కృష్ణ జిల్లా మచిలీట్నానికి ఎస్పీ గా నియమించారు. ఆయన స్థానంలో జిల్లా ఎఎస్పీ చౌడేశ్వరి ని ఇంఛార్జి ఎస్పీ గా నియమించారు. తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో, ఎట్టకేలకు ప్రకాశం జిల్లా ఎస్పీ ఎవరు అనే చర్చకు తెర పడింది. కృష్ణ జిల్లా ఎఎస్పీగా విధులు నిర్వహిస్తున్న మల్లికాగార్గ్ ని, ప్రభుత్వం ప్రకాశం జిల్లా ఎస్పీగా నియమించింది. ప్రకాశం జిల్లా ఎస్పీ గా నియమితులైన మల్లికాగార్గ్ పశ్చిమ బెంగాల్‌కి చెందిన పోలీస్ అధికారి. మల్లికా గార్గ్ ప్రకాశం జిల్లాలో తొలి మహిళా ఎస్పీ గా చెప్పుకోవచ్చు.

## లెట్జ్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు విస్తృతం



చీరాల(ఒంగోలు) : లెట్జ్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తున్నట్లు ప్రతినిధులు పేర్కొన్నారు. చీరాల మున్సిపాలిటీ పరిధిలోని 31 వ వార్డు జయంతి పేటకు చెందిన జంగా రమేష్‌బాబు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కుటుంబానికి పెద్ద దిక్కు కోల్పోవటంతో, వారి కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతుంది. ఈ విషయాన్ని ఫౌండేషన్ ప్రతినిధులు తెలుసుకొని, ఫౌండేషన్ చైర్మన్ ఎన్.ఆర్.ఐ.లు రామిశెట్టి దిలీప్ కుమార్,అనూష దంపతుల దృష్టికి తీసుకెళ్లారు. వారి సహాయ సహకారాలతో, బాధిత కుటుంబానికి 40 వేల రూపాయలనగదుతో పాటు, 50కేజీల బియ్యాన్ని కుటుంబసభ్యులకు అందజేశారు. తమ ఫౌండేషన్ తరపున, పేదవారిని ఆదుకుంటామని ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో కిరణ్ కుమార్, హర్ష,అరవింద్ ప్రేమ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువతా నిరుత్సాహం వద్దు

అమరావతి: ఆత్మహత్య చేసుకున్న నిరుద్యోగి నాగేంద్రప్రసాద్ తల్లికి సాయంగా రూ. 2 లక్షల చెక్ ను టీడీపీ నేత నారా లోకేష్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏ తల్లికి ఇటువంటి కష్టం రాకుండా అంతా కలిసి ప్రభుత్వంపై పోరాడుదామన్నారు. అండగా ముందు నేనుంటానంటూ లోకేష్ హామీ ఇచ్చారు. వైఎస్ జగన్‌రెడ్డి అధికారంలోకొచ్చి రెండేళ్లయినా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ లేదనే నిరుత్సాహంతో యువకులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారరని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవ్వరూ నిరుత్సాహం చెందొద్దన్నారు. అండగా తానుంటానని భరోసా ఇచ్చారు.

## ఎయిడెడ్ పాఠశాలల రేషనైలేజేషన్ రద్దు చేయాలి - యుటిఎఫ్ సీనియర్ నాయకులు కె.వీరాంజనేయులు




చీరాల(ఒంగోలు) : ఎయిడెడ్ పాఠశాలల రేషనలైజేషన్ జీవో నెంబర్ 37 అసంబద్ధంగా ఉన్నందున, దానిని రద్దు చేయాలని, యుటిఎఫ్ సీనియర్ నాయకులు కె.వీరాంజనేయులు డిమాండ్ చేశారు. ఎయిడెడ్ యాజమాన్యంలో పాఠశాలల రేషనలైజేషన్ లో అసంబద్ధతలను ఖండిస్తూ, సమస్యను పరిష్కరించవల్సినదిగా మండలవిద్యాశాఖాధికారికి, యుటీఎఫ్‌నాయకులు వినతిపత్రం అందజేశారు. విద్యా హక్కు చట్టానికి వ్యతిరేకంగా, ఎయిడెడ్‌యాజమాన్యంలోచేపట్టిన రేషనలైజేషన్ ప్రక్రియవల్ల,విద్యార్థులు,ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోయేపరిస్థితి ఉంది. ఎటువంటి మార్గదర్శకాలు విడుదలచేయకుండా, కేవలం 1:40 విద్యార్థి,ఉపాధ్యాయనిష్పత్తి ప్రకారంగా, హేతుబద్ధీకరణ నిర్వహించడం వల్ల,పాఠశాలలు మూతపడే పరిస్థితి ఉందని, దీన్ని సవరించి మండలపరిషత్, మున్సిపల్ యాజమాన్యంలో చేపట్టిన విధంగానే, ఎయిడెడ్ యాజమాన్యాలకు కూడా, సరైన మార్గదర్శకాలు రూపొందించి, 1:20 నిష్పత్తిలో రేషనలైజేషన్ చేపట్టాలని కోరారు. ఎయిడెడ్‌యాజమాన్యాల పాఠశాల పునరుద్ధరణకు అవకాశం, సరైనసౌకర్యాలు కల్పించాలని కోరారు. డి.ఈ.ఓ.కి, ఉన్నతాధికారులకు తెలియజేయవలసిందిగా, ఎం.ఈ.ఓ.నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లాకార్యదర్శులు జి.సూరిబాబు, షేక్.జానిబాషా, జిల్లా ఎయిడెడ్‌కన్వీనర్ కుర్రా శ్రీనివాసరావు, సీనియర్ ఉపాధ్యాయులు కె.వీరాంజనేయులు, చీరాలమండలశాఖ అధ్యక్ష ప్రధానకార్యదర్శులు బి. బాలచంద్రరావు, బి.భిక్షాలుబాబు తదితరులు పాల్గొన్నారు.

## చీరాల ప్రాంతంలో విద్యాభివృద్ధికి కారణం విద్యాదాత జేమ్స్ ఆలోచన మాత్రమే - నీలం జేమ్స్‌కి ఘన నివాళి



చీరాల(ఒంగోలు) : చీరాల ప్రాంతంలో విద్యాభివృద్ధికి కారణం విద్యాదాత జేమ్స్ ఆలోచన మాత్రమే నని ప్రధానోపాధ్యాయులు రావి.వెంకటరమణ అన్నారు. ప్రముఖ విద్యాదాత, కీర్తిశేషులు నీలం జేమ్స్ వర్ధంతి, స్థానిక బోస్‌నగర్‌లోని, నీలం జేమ్స్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల నందు ఘనంగా నిర్వహించారు. మహోన్నతవ్యక్తి నీలం జేమ్స్ చిత్రపటానికి, ప్రధానోపాధ్యాయులు రావి.వెంకటరమణ దండ వేసి నివాళులర్పించారు. సమాజంలో ఎక్కువ మందిని, సమాజానికి ఉపయోగపడే, భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలనే సదాశయంతో, స్వాతంత్ర్యానికి పూర్వం 1940వ సంవత్సరంలో, బోస్‌నగర్‌లో ప్రాథమికపాఠశాల ప్రారంభించి, తదుపరి 1967లో ప్రాథమికోన్నతపాఠశాలగా మార్చి, తదనంతరం 1983లో ఉన్నతపాఠశాలగా వృద్ధిచేశారన్నారు. ఈనాడు బోస్‌నగర్, నవాబుపేట, ముత్యాలపేట, గంజిపాలెం, బండపాలెం, రామకృష్ణాపురం, సాల్మన్‌సెంటర్ తదితరప్రాంతాలు, విద్యాపరంగా అభివృద్ధిచెందినవంటే, కారణం విద్యాదాత జేమ్స్ ఆలోచన మాత్రమేఅన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నూనె బంగారు తల్లి, రామిశెట్టి వెంకట సాంబశివరావు, పేర్లి రాజ్యలక్ష్మి, పద్మావతి, రమావాణి, శ్యామల, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన

సంపాదకీయం

గురువారం 15, జులై 2021

# ప్రభుత్వ రంగ 'బీమా'పై కేంద్రం దాడులు

ప్రభుత్వ రంగ సాధారణ బీమా సంస్థగా వున్న యునైటెడ్ ఇండియా కంపెనీని ప్రయివేటీకరించాలని తాజాగా నీతి ఆయోగ్ సంస్థ సిఫార్సు చేసినట్లు పత్రికలలో కథనాలు వస్తున్నాయి. ఈ సిఫార్సులకు అనుగుణంగానే పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లోనే జిఐబిఎన్ఎ చట్టానికి సవరణలు ప్రతిపాదిస్తూ ఒక బిల్లు తీసుకు వస్తున్నట్లు కూడా తెలుస్తోంది.

యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ 1938లో స్థాపించబడింది. 1972లో ప్రభుత్వ రంగ సాధారణ బీమా సంస్థల జాతీయీకరణ తరువాత ప్రభుత్వం 107 సాధారణ బీమా కంపెనీలను జాతీయం చేసింది. అప్పటి నుండి యునైటెడ్ ఇండియా సంస్థ బ్రహ్మాండమైన పురోగతి సాధించింది. ఇప్పటికే రూ. 27,930 కోట్ల పెట్టుబడులను, వందల కోట్ల రూపాయల డివిడెండ్ ను కేంద్ర ప్రభుత్వానికి అందించింది. గత ఏడాది రూ. 17,000 కోట్ల ప్రీమియమ్‌ను సాధించింది. అటువంటి సంస్థ మీద ప్రభుత్వం దాడికి దిగింది. ఇప్పటికే, న్యూ ఇండియా బీమా సంస్థలో, జిఐసి రీ-ఇన్సూరెన్సు సంస్థలో ప్రభుత్వ వాటాలు అమ్మిన ప్రభుత్వం, ఇప్పుడు ఏకంగా యునైటెడ్ ఇండియా కంపెనీ నే అమ్మేయాలని నిర్ణయించడం శోచనీయం. నాలుగు ప్రభుత్వ సాధారణ బీమా సంస్థలను విలీనం చేస్తే, అది ఎల్ఐసి వలే ఒక అద్భుత సంస్థగా ఉంటుందని, కనుక ప్రభుత్వం ఆ పని చేయాలని నాటి బిజెపి నాయకుడు విజరు కుమార్ మల్హోత్రా నేతృత్వంలో పార్లమెంటరీ కమిటీ 2001 లోనే సిఫార్సు చేసింది. 20 ఏళ్లు గడిచినా, ఆ సిఫార్సు అమలు కాలేదు, సరికదా ప్రభుత్వ సాధారణ బీమా సంస్థల అమ్మకానికి నిర్ణయాలు తీసుకోవడం గర్హనీయం.

చట్ట సవరణల పేరుతో లిస్టింగ్‌కు దూకుడు

ఈ ఏడాది బడ్జెట్ సమావేశాల్లో ఆమోదించిన ఎల్.ఐ.సి చట్ట సవరణ బిల్లుపై గెజిట్‌ను కొన్ని రోజుల ముందు ప్రభుత్వం విడుదల చేసింది. స్టాక్ మార్కెట్‌కు అనుగుణంగా ఎల్.ఐ.సి లో అంతర్గత మార్పులకు పెద్ద ఎత్తున శ్రీకారం చుట్టారు. వచ్చే మార్చి లోపు ఎలాగైనా ఎల్.ఐ.సి లో పెట్టుబడులు ఉపసంహరించాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా కనబడుతోంది. ఎల్ఐసీలో ఐపీవో నిర్ణయంపై దేశవ్యాప్తంగా నిరసనల వెల్లువ కారణంగా, ఎల్.ఐ.సి కి వున్న ప్రభుత్వ గ్యారెంటీ కొనసాగుతుందని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఎల్.ఐ.సి జాతీయీకరణ ముందు...ప్రైవేట్ బీమా కంపెనీల అక్రమాలను చూసి...ప్రభుత్వం ఎల్ఐసీ పాలసీలకు ప్రభుత్వ గ్యారెంటీ మంజూరు చేసింది. దీని ప్రకారం ఎల్.ఐ.సి లో పాలసీదారులు దాచుకున్న మొత్తాలకు, బోనస్ లకు కేంద్ర ప్రభుత్వం అదనంగా గ్యారంటీ ఇస్తుంది. 1956లో ఈ సెక్షన్ 37 ను ఎల్ఐసీ చట్టంలో పొందు పరిచినా, ఇంతవరకూ ఎల్ఐసీ ఈ గ్యారెంటీని ఉపయోగించుకోలేదు. దేశంలో ఎలాంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినా అన్ని నిబంధనలు సడలించి పాలసీదారుల క్లెయిములను, ఒక్క రూపాయి ప్రభుత్వ సాయం లేకుండానే, పరిష్కరించింది. కర్ణుడి కవచ కుండలాలుగా సెక్షన్ 37 ఎల్.ఐ.సి అమ్ముల పొదిలో ఉంది తప్ప దానిని ఉపయోగించిన సందర్భం ఇంతవరకు లేదు. స్టాక్ మార్కెట్‌లో ఒడిదుడుకులు సంభవించిన ప్రతి సందర్భంలోనూ ఎల్ఐసీనే మార్కెట్లను ఆదుకున్నది. కేంద్ర ప్రభుత్వం ఎల్ఐసీ లో పెట్టిన 100 కోట్ల ఈక్విటీ పెట్టుబడిపై 1956 నుంచి ఇప్పటివరకు డివిడెండ్ రూపంలో రూ. 26,005 కోట్లను చెల్లించింది. 2019-20 సంవత్సరానికి రూ. 2,697 కోట్ల డివిడెండ్‌ను ప్రభుత్వానికి అందించనుంది. పన్నుల రూపంలో ఏటా పది వేల కోట్ల పైబడి చెల్లిస్తున్నది.

లిస్టింగ్ వల్ల కంపెనీలలో ఆర్థిక క్రమశిక్షణ పెరిగేలా ఉంటే, సెబీ కనుసన్నల్లో ఉన్న లిస్టింగ్ కంపెనీలు ఎందుకు విఫలం అవుతున్నాయి? చైనా లైఫ్‌తో సహా, ప్రపంచంలో ఏ ప్రభుత్వ రంగ బీమా సంస్థ కూడా ప్రైవేటు, బహుళ జాతి బీమా కంపెనీలతో పోటీ పడి 50 శాతం మార్కెట్ వాటాను సైతం నిలబెట్టుకోలేక పోయాయి. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో సైతం ఎల్ఐసీ 23 ప్రైవేటు బీమా కంపెనీల పోటీని ఎదుర్కొంటూ 67 శాతానికి పైగా మార్కెట్ షేర్‌తో మార్కెట్ లీడర్‌గా కొనసాగుతున్నది. లాభనష్టాలతో సంబంధం లేకుండా గ్రామీణ ప్రాంతాల్లో కూడా విస్తృతంగా బీమా సేవలను ఎల్.ఐ.సి అందిస్తోంది. 2547 కార్యాలయాలను (52.1 శాతం) 50,000 కంటే తక్కువ జనాభా కలిగిన గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాల్లో ఎల్.ఐ.సి నెలకొల్పింది. 23 ప్రైవేట్ బీమా కంపెనీల 77.1 శాతం కార్యాలయాలు మెట్రో, అర్బన్ ప్రాంతాల్లోనే నెలకొల్పబడ్డాయి. ఎల్.ఐ.సి ఐ.పి.ఓ కు తహతహ లాడుతున్న ప్రభుత్వం, ఐఆర్‌డిఎ నిర్దేశించిన నియమాలకు విరుద్ధంగా ప్రయివేట్ కంపెనీలు వ్యవహరిస్తుంటే చర్యలు ఎందుకు తీసుకోదు?

ఎల్.ఐ.సి ని తెల్ల ఏనుగుగా గతంలో అభివర్ణించిన కొన్ని కార్పొరేట్ మీడియా సంస్థలు, నేడు ఎల్.ఐ.సి మార్కెట్ ప్రదర్శనను పనిగట్టుకొని ప్రచారం చేస్తున్నాయి. ఎల్.ఐ.సి చాలా బాగా పని చేస్తోంది గాబట్టి స్టాక్‌మార్కెట్‌లో లిస్టింగ్ చేస్తే, ఇంకా బాగా ప్రదర్శన చేస్తుందనేది వారి వాదన. దీనికి అనుగుణంగానే వారు ఎల్.ఐ.సి ఆస్తులకు, పెట్టుబడులకు ప్రచారం కల్పిస్తున్నారు. వారి ఎత్తుగడలను మనం అర్థం చేసుకోవాలి. ఎల్ఐసి ని స్థాపించి డైమండ్ జూబ్లీ పూర్తయిన సందర్భంలో (2016లో) అప్పటి ఆర్థికమంత్రి, అరుణ్ జైట్లీ ఎల్ఐసి ఒక తిరుగులేని ఆర్థిక సంస్థ అని స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ చేస్తే ఎల్ఐసి విలువ ఇంకా పెరుగుతుందని అనడం ఈ కోవలోనిదే!అమెరికా లోని బీమా కంపెనీలను సర్వే చేసే ఎ.ఎమ్ ఏజెన్సీ దిగ్భ్రాంతి కలిగించే వాస్తవాలు బయట పెట్టింది. అమెరికన్ బీమా కంపెనీలు అధిక లాభాపేక్షతో తమ 34 శాతం పెట్టుబడులను కార్పొరేట్ డెబిట్ ఫండ్లలో పెట్టుబడులు పెట్టాయి. నేడు ఆ ఫండ్ల రేటింగ్ 'జంక్'గా తేలింది. అంటే, ఆ కంపెనీలు పెద్దఎత్తున దివాళా తీసే పరిస్థితి దాపురించింది. ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న ఇటువంటి పరిణామాలు చూసైనా, ఎల్ఐసి ని లిస్టింగ్ చేసే ప్రయత్నాలను ప్రభుత్వం విరమించుకోవాలి. ఎల్.ఐ.సి ని 100 శాతం ప్రభుత్వ రంగ సంస్థ గా కొనసాగించాలని చేస్తున్న పోరాట ముఖ్య ఉద్దేశ్యం-ప్రజల సొమ్ము ప్రజల సంక్షేమం కోసం వినియోగించబడాలనే. ఎల్.ఐ.సి పెట్టుబడులు 130 కోట్ల మందికి ఉపయోగపడాలి తప్ప, 3 శాతంగా ఉన్న సంస్థాగత మదుపుదారులకు కాదు.

2019-20 ఆర్థిక సంవత్సరంలో ఈక్విటీ పెట్టుబడులపై ఎల్.ఐ.సి ఆర్జించిన లాభం సుమారు రూ. 30,000 కోట్లు కాగా, 2020-21లో అది 47 శాతం పెరిగి రూ. 44,530 కోట్లు అవడం ఎల్.ఐ.సి దూరదృష్టికి, దార్శనికతకు అద్దం పడుతుంది. 31.3.2020 నాటికి ఎల్.ఐ.సి నికర నిరర్థక ఆస్తుల శాతం 0.79 శాతం కాగా, 31.3.2021 నాటికి అది కేవలం 0.05 శాతానికి చేరుకుంది. ఇంతకంటే సమర్థవంతంగా ఏ సంస్థ అయినా పని చేయగలదా? ఒకపక్క ఆత్మనిర్భర భారత్ అంటూ, దేశ ఆర్థిక వ్యవస్థకు జవసత్వాలు అందించే ప్రభుత్వ బీమా రంగాన్ని నిర్వీర్యం చేసే చర్యలు తీసుకోవడం సహేతుకం కాదు. యునైటెడ్ ఇండియా ప్రయివేటీకరణ ప్రయత్నాలను, ఎల్.ఐ.సి లిస్టింగ్ ప్రతిపాదనలను ప్రభుత్వం విడనాడాలని, బీమా ప్రీమియంపై భారంగా మారిన జి.ఎస్.టి ని తొలగించాలని ఇప్పటికే ప్రభుత్వ బీమా రంగ సంస్థల ఉద్యోగులు ఉద్యమ బాట పట్టారు. విశాల జన హితం కోసం, దేశ ఆర్థిక స్వావలంబన కోసం జరుగుతున్న ఈ ఉద్యమానికి దేశభక్తులైన ప్రజానీకం మద్దతు పలకాలి.

## పిల్లలు.. నా పిల్లలు..

పిల్లలు పుట్టారు.
పూజ్య పూర్వీకుల వృక్షం నుంచి
వాళ్ల పేర్లను బట్టి
పొత్తిళ్లలోకి తీసుకున్నారు
రూపొందిన కార్యక్రమాల నుంచి
వేచి చూస్తున్న భవిష్యత్ నుంచి
ఎదురుచూపుల మంటల మీద
ఉడికించిన దాల్చిన చెక్క వాసన నుంచి
వాళ్లను స్వీకరించారు.
పుట్టినరోజుల వేడుకల నుంచి
విందుల నుంచి, నూతన వస్త్రాల నుంచి
వాళ్లను గ్రహించారు.

నా పిల్లలు పుట్టారు.
ప్రేమ నిండిన కన్నీళ్లతో
భయంతో వణుకుతూ వాళ్లను స్వీకరించాం

వాళ్ల కోసం ఎదురుచూస్తూ
ప్రసూతి ఆసుపత్రి గేట్ల దగ్గర
పిచ్చికుక్కల కళ్లు..
వాళ్ల కోసం ఎదురుచూస్తూ
పోలీసు దళాలు..
వాళ్ల కోసం ఎదురుచూస్తూ
వేచి వున్న మృత్యువు..
దేహ పరిసమాప్తి కార్యక్రమాలు..

నా పిల్లలు పుట్టారు..
వాళ్లతో పాటుగా
ఉత్సవాల్లో మిరుమిట్లు గొలిపే
బాణాసంచా వెలుగుల్లా పేలే
తెల్ల భాస్వరం బాంబులూ పుట్టాయి

నా పిల్లలు పుట్టారు..
వాళ్లతో పాటుగా
వాళ్ల చిన్ని శవపేటికలూ

..వా

# ప్రశ్నే అతని ఆయుధం

పులుల బోనులాంటి ఆధిపత్యాల సమాజం మనది. ఇందులో బలహీనులు, బ్యాక్‌గ్రౌండ్ లేనివారు రాణించాలంటే ఎంతో యుద్ధం చేయాలి. అలా చేస్తే తప్ప, తమ కలలు సాకారం కావడం సాధ్యం కాదు. అట్లా ఆధిపత్యాలకు పెట్టని కోటలుగా ఉన్న సినీ, రాజకీయరంగాల్లో అనతికాలంలో తనదైన స్థానాన్ని సొంతం చేసుకున్న అలుపెరుగని పోరాటకారుడు కత్తి మహేష్. ఆయన అకాల మరణం తెలుగు సమాజానికి తీరని లోటు. అటు సినీరంగంతో పాటు, ఇటు సామాజికరంగంలో కూడా ఆయన లేని లోటు పూడ్చలేనిదంటే అతిశయోక్తి కాదు. కత్తి మహేష్ పేరు వింటే ఆయన మిత్రుల మనసులు ఎంతగా పులకరిస్తాయో అతని శత్రువుల గుండెలు సైతం అంతే రగిలిపోతాయి. అందుకు కారణం అతని నిబద్ధత, నిజాయితీతో పాటు నిత్యం బాధిత సమూహాల పక్షాన గొంతెత్తడం అతని ప్రవృత్తిగా మారడమే. మహేష్‌ను దగ్గరగా చూసిన వారికి అతనిలోని తెగింపు, మడమ తిప్పనితనం విపరీతంగా నచ్చుతాయి. తాను అనుకున్న లైన్ ఎట్లా సరైందో విడమరచి చెప్పేవాడు. అవతలి వారి ఆలోచనలోని తప్పుడు ధోరణుల్ని ఎప్పటికప్పుడు ఎండగట్టేవాడు. ఈ నిఖార్సయిన తిరుగుబాటుతనమే తనకు మిత్రులతో పాటు శత్రువులను కూడా సంపాదించి పెట్టింది. అతని శత్రువులకు కత్తిలోని స్నేహశీలి, పోరాటాల తిరుగుబాటుదారుడు అంతగా తెలిసే అవకాశం లేదు. అంతే కాదు, కత్తి బహుముఖ ప్రజ్ఞాశాలి. సినీ క్రిటిక్‌గా, దర్శకునిగా, నటునిగా, వ్యాఖ్యాతగా, సామాజిక ఉద్యమకారునిగా, ఔత్సాహిక రాజకీయవేత్తగా ఆయన చేసిన కృషి అసామాన్యమైనది. కేవలం నాలుగున్నర పదుల వయసులోనే ఇన్ని రకాలైన పనులు చేయడం బహుశా కత్తికే సాధ్యమైంది. అది ఆయన జీవన నేపథ్యం నేర్పిన పాఠమైంది. చిత్తూరు జిల్లా తిరుపతి సమీపంలోని పీలేరు అనే ఒక చిన్న గ్రామం నుండి కత్తి ప్రస్థానం మొదలైంది. చిన్ననాటి నుంచి చదువులో ముందుండే కత్తి, తన భవిష్యత్తును చదువులోనే చూసుకున్నాడు. అట్లా ప్రతిష్ఠాత్మకమైన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చేరుకున్నాడు. అక్కడ మాస్ కమ్యూనికేషన్స్ కోర్సులో చేరి తన ఆలోచనా ప్రపంచాన్ని మరింత విశాలం చేసుకున్నాడు. సినిమాల పట్ల తనకున్న అభిలాషను మరింత పరిశోధనాత్మక పద్ధతిలో పెంపొందించుకున్నాడు. ప్రపంచ సినిమాను, ఇండియన్ సినిమాను పోల్చి అనేక విశ్లేషణలు చేశాడు. అదే కత్తిని మంచి సినీ విమర్శకుణ్ణి చేసింది. అనేకమంది అభిమానుల్ని అక్కున చేర్చింది.ఏ మహేష్ అంటే ఫిల్మ్ క్రిటిక్ కత్తి మహేష్ అనే పేరు అనతికాలంలోనే బాగా పాపులర్ అయింది. దీంతో రకరకాల టీవీ ఛానళ్లు కత్తి రివ్యూల కోసం స్పేస్‌ను కేటాయించాయి. ఆయన విశ్లేషణలకు ఆదరణ ఎంత వరకు వెళ్లిందంటే, కత్తి రివ్యూ చూశాకే కొత్త సినిమా చూడాలి అనే వరకు చేరింది. అట్లా నిర్మొహమాటంగా సినిమాలను సమీక్షించేవాడు. నిష్పక్షపాతంగా రేటింగులు ఇచ్చేవాడు. సినిమాలోని లోపాలను చెప్పినంత నిర్భయంగా వాటిలోని మంచి విషయాలను కూడా అంతే జాగ్రత్తగా చెప్పేవాడు. ఇదే కత్తిని కత్తిలా నిలబెట్టింది. అక్కడి నుండి రివ్వున గాలిలో ఎగిరినట్టు కత్తి పేరు, రూపమూ వెండితెర మీద కూడా కనిపించడం మొదలైంది. తనలోని నటుణ్ణి ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చి మెప్పించాడు. అంతటితోటే సంతోష పడకుండా సినిమాలను డైరెక్ట్ చేసే స్థాయికి వెళ్లాడు. అట్లా రెండు మూడు సినిమాలకు డైరక్షన్ చేసి చూపించాడు. గాడ్‌ఫాదర్‌లు ఉంటే తప్ప రాణించలేని సినిమా ఇండస్ట్రీలో ఏ బ్యాక్‌గ్రౌండ్ లేకుండానే తనకంటూ ఒక గుర్తింపును, గౌరవాన్ని సంపాదించుకోగలిగాడు. ఈ నేపథ్యంలోనే ఒక అగ్రహీరో సినిమాల మీద తాను చేసిన విశ్లేషణల వల్ల అనేక ఆటుపోట్లను ఎదుర్కొన్నాడు. నిత్యం కొన్ని నెలలపాటు వేధింపులు ఎదురైనా సరే ధైర్యంగా వాటిని ఎదుర్కొన్నాడు. వేలాది ఫోన్‌కాల్స్, ప్రత్యక్ష బెదిరింపులకు సైతం జడవకుండా తన మాట మీదే నిలబడడం కత్తికి మరింత మంది అభిమానులను తెచ్చిపెట్టింది. అలా కత్తి మహేష్ అంటే ఒక తిరుగుబాటు, ఒక ధిక్కారం, ఒక తెగింపు అనే విషయం మన సమాజానికి తెలిసి వచ్చింది. ఇంతటితోటే ఆగిపోయి ఉంటే కత్తి మహేష్ కేవలం సినిమా మనిషి అయ్యేవాడు. కానీ, కత్తిలో ఒక సామాజిక ఆలోచనాపరుడు కూడా ఉన్నాడు. అందుకే ఆయన రాజకీయాల మీద కూడా దృష్టి సారించాడు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వస్తున్న మార్పులను నిత్యం సమీక్షించుకుంటూ, ఎవరు ప్రజలకు మేలు చేస్తారనే ఆలోచనలను సామాజిక మాధ్యమాల మీదుగా పంచుకునేవాడు. అట్లా కత్తి మాట్లాడేటప్పుడు తప్పకుండా రేపు భవిష్యత్తులో ఒక మంచి నేతగా ఎదిగి వస్తాడనే ఆశలు కల్పించాడు.ఇక కత్తిలో చాలామందికి నచ్చే అంశం అతడిలోని సామాజిక ఉద్యమకారునితనం. ఈ సమాజంలో కుల, మత బాధితుల పక్షం వహించాలనే ప్రజాస్వామికతనం తనను కుదురుగా ఉండనిచ్చేది కాదు. అందుకే ఎక్కడ దళితుల మీద దాడి జరిగినా రెక్కలు కట్టుకు వాలిపోయేవాడు. అది రోహిత్ వేముల పోరాటమైనా, మరొకటి అయినా బాధితులకు అండగా నిలబడడం అనేది తన జీవనవిధానంగా మార్చుకున్నాడు. సాధారణంగా సినీ పాపులారిటీ వచ్చిన వాళ్లు తమ కార్ల నల్లటి అద్దాలు దాటి బయటి ప్రపంచాన్ని చూడడానికి అంతగా ఇష్టాన్ని చూపించరు. కానీ, కత్తి వారికి భిన్నంగా ఈ సమాజంలో ఒక విద్యావంతునిగా, ఆలోచనాపరునిగా, సామాజిక చింతనాపరునిగా నిత్యం బాధితుల కోసం పని చేస్తూనే ముందుకు సాగాడు. ఇందుకోసం ఆయన బాబా సాహెబ్ అంబేడ్కర్ ఐడియాలజీని ఆశ్రయించాడు. బహుజన మహనీయుల స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలని సూచించాడు. దళిత, బహుజనుల సకల సమస్యలకు రాజ్యాధికారమే మార్గమని నమ్మాడు. మరోవైపు కత్తిలో మంచి పాఠకుడు కూడా ఉన్నాడు. నిత్యం



సాహిత్యాన్ని చదువుతూ, తరచుగా సాహిత్యసభలకు హాజరయ్యేవాడు. వక్తగా సాహిత్యసభల్లో మాట్లాడే సమయంలో కూడా ఏ వర్తమాన విమర్శకునికి తీసిపోని విధంగా తనదైన అధ్యయన అవగాహనతో సాహిత్యాన్ని విశ్లేషించేవాడు. సాహిత్యాన్ని ఎట్లా అర్థం చేసుకోవాలో అధునాతనమైన ప్రాపంచిక దృక్పథంతో విడమరిచి చెప్పేవాడు. అట్లా ఎంతోమంది సాహితీమిత్రులను కూడా సంపాదించుకున్నాడు. ఇన్ని రంగాల్లో సమానమైన జ్ఞానాన్ని కలిగి ఉండడం అందరికీ సాధ్యం కాదు. ఇట్లా ఎంతోమంది అభిమానులను, మిత్రులను సంపాదించుకున్న ఒక కలం, గళం అకాల మరణం పాలు కావడం ఎవ్వరూ ఊహించని పరిణామం. అత్యంత విషాదకరం. రేపటి అనేక పరిణామాలకు, మార్పులకు మూలస్తంభంగా నిలుస్తాడని ఆశించిన వారందరినీ తీవ్ర దు??ఃఖంలో ముంచి కత్తి మహేష్ వెళ్లిపోవడం బాధాకరం. అతనితో చాలా సన్నిహితంగా మెలిగిన నాలాంటి వారికి ఇదొక చీకటి రోజు. ప్రమాదకరమైన పరిస్థితులను ఎదురించి పోరాడి గెలిచిన కత్తిని, రోడ్డు ప్రమాదం మాత్రం ఓడించింది. ఈ సమాజం మేలు కోసం నిరంతరం పని చేసే ఒక సామాజిక గొంతును అకాల మరణం మూగబోయేలా చేసింది. ఆ మరపురాని మనిషికి కడసారి కన్నీటి జోహార్లు!!

# స్థలం కొరకు అష్టకష్టాలు పడుతున్న పేదలు

చల్లపల్లి-(ప్రజాపాలన): ప్రభుత్వం పేదలకు మంజూరు చేసే ఇళ్ల స్థలం కొరకు అర్హులైన పేదలు అష్టకష్టాలు పడుతున్నారు ప్రభుత్వం అర్హులైన పేదలకు స్థలం మంజూరు చేస్తున్నామని ప్రకటించినప్పటికీ అర్హులైన పేదలకు ప్రభుత్వం మంజూరు చేసే స్థలం దక్కక పేదలు నేతలు అధికారుల వద్దకు ఉరుకులు పరుగులు పెట్టిన ఉపయోగం లేకుండా పోతుంది గతంలో పేదలు ఇళ్ల స్థలం కొరకు అనేక దఫాలు అర్జీలు పెట్టినా స్థలం అనేది మంజూరు కాలేదు గత ప్రభుత్వ పాలనలో పేదలు ప్రతి ప్రభుత్వ కార్యక్రమంలో ఇళ్ల స్థలం కొరకు దరఖాస్తులు పెడుతూ వచ్చారు పేదలు పెట్టిన దరఖాస్తులను అధికారులు విచారించారో లేదో కానీ సెంటు స్థలం కూడా ఇవ్వలేదు కానీ ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం ప్రతి ఒక్క అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తున్నామని చెప్పడంతో పేదలు ఆశలు పెంచుకున్నారు అధికారులకు పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చాయి విచారించి అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తున్నామని ప్రకటించారు కానీ అధికారులు అర్హుల జాబితాను విడుదల చేయగా అందులో అర్హులైన పేదలకు పేర్లు లేకపోగా అనర్హుల పేర్లు ఉన్నాయని పెద్ద ఎత్తున ఆరోపణలు వెలువడ్డాయి అయినా పేదల మాటను పక్కన పెట్టి అధికారులు ప్రకటించినా జాబితా ప్రకారం స్థలాలు మంజూరు చేశారు దీంతో అఖిలపక్ష పార్టీల నాయకులు అర్హులైన పేదలకు న్యాయం జరగలేదని మండల జిల్లా స్థాయి అధికారులకు వినతి పత్రాలు అందించారు ఉన్నతాధికారులు విచారించి అనర్హులను జాబితా నుండి తొలగించి అర్హులైన వారికి స్థలం మంజూరు చేస్తామని హామీ ఇచ్చి కానీ ఆఖరికి స్థలాలు ముందుగా ప్రకటించిన జాబితా ప్రకారమే మంజూరు చేశారు వివిధ దశల్లో అఖిలపక్ష పార్టీ నాయకులు ఆందోళన చేసినప్పటికీ ఉపయోగం లేకుండా పోయింది దీంతో పేదలు స్థలాలు కొరకు పేదలు మరలా దరఖాస్తులు చేసుకున్న అర్హులైన పేదలకు సెంటు స్థలం కూడా దక్కని పరిస్థితి ఏర్పడింది చల్లపల్లి మండలంలో మేజర్ పంచాయతీ అయినా లక్ష్మీపురం చల్లపల్లిలో ప్రభుత్వం స్థలాలను మంజూరు చేసింది లక్ష్మీపురం పంచాయతీలో 350 మందికి చల్లపల్లిలో 840 మందికి 799 మందికి స్థలాలు మంజూరు చేశారు వీరిలో అనర్హులు ఉన్నారని అఖిలపక్ష పార్టీ నాయకులు అధికారులకు వినతి పత్రాలు పండించడంతో పాటు నిరసన కార్యక్రమాలు కూడా చేశారు కానీ అధికారులు వారి పని వారు చేసుకుంటూ పోయారు అర్హులై స్థలము లేని పేదలు నేటికీ అర్జీలు పెట్టుకుంటూనే ఉన్నారు ప్రభుత్వం 90 రోజులకు ఒకసారి స్థలాలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించడంతో స్థలం దక్కని పేదలు ఆశలు పెంచుకున్నారు ఈసారైనా అర్హులైన పేదలకు స్థలం మంజూరు చేస్తారని ఆశాభావంతో ఉన్నారు



## రాష్ట్ర చేనేత జన సమాఖ్య సామాజిక సేవాకార్యక్రమాలు స్ఫూర్తిదాయకం - జిల్లా వైఎస్ఆర్ సీపీ యువనేత కరణం వెంకటేష్

చీరాల(ఒంగోలు) : ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న, రాష్ట్ర చేనేత జనసమాఖ్య సామాజిక సేవలు మరువలేనివని, స్ఫూర్తిదాయకమని, ప్రకాశంజిల్లా వైఎస్ఆర్ సీపీ యువనేత కరణం వెంకటేష్ అన్నారు. చేనేతపురి కాలనీలో, రాష్ట్ర చేనేత జన సమాఖ్య అధ్యక్షులు మాచర్ల మోహనరావు ఆధ్వర్యంలో జరిగిన, నిత్యావసర వస్తువుల పంపిణీ కార్యక్రమానికి, ముఖ్య అతిథిగా హాజరైన, కరణం వెంకటేష్ నిత్యావసర వస్తువుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట రాష్ట్ర దేవాంగకార్పొరేషన్ చైర్మన్ బీరక సురేంద్ర, మాచర్ల మోహన్‌రావు, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజలు, నేతన్నలు పాల్గొన్నారు.

## మేజర్ సీసీ డ్రైనేజ్ నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే జగన్ మోహన్ రావు



నందిగామ14జులై(ప్రజాపాలన: పట్టణంలోని రైతుపే ట డౌన్ 7 మరియు 8 వ వార్డుల పరిధిలో గల మేజర్ సీసీ డ్రైనేజి నిర్మాణ పనులను శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు బుధవారం అధి కారులు మరియు పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో డ్రై నేజ్ వ్యవస్థను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక నిధులు కేటాయించామని ,అందులో భాగం గానే పట్టణంలోని 20 వార్డులలో ప్రాధాన్యత క్రమంలో మేజర్ సీసీ డ్రైనేజీ లపై ప్రత్యేక దృష్టి సారించా మని తెలిపారు. పట్టణంలోని 7 మరియు 8 వ వార్డు ల పరిధిలో గల మేజర్ డ్రైనేజ్ పై అధికారులను అడి గి వివరాలు తెలుసుకుని ,కాంట్రాక్టర్లు నిర్మాణ పను లలో నాణ్యత ప్రమాణాలు పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు ,అవసరమైన చోట కల్వర్టులు ఏర్పాటు చేయాలని సూచించారు ,ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ ,వైస్ చై ర్మన్ కమిషనర్ ,కౌన్సిల్ సభ్యులు ,మున్సిపల్ అధి కారులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యక ర్తలు పాల్గొన్నారు.

## ఆక్రమణలో పేదల భూములు

చల్లపల్లి-(ప్రజాపాలన): ప్రభుత్వ భూమి భూస్వాముల పెత్తందార్ల ఆక్రమణలో ఉండడంతో పేదలు భూమి కొరకు పోరాట బాట పట్టారు ప్రభుత్వ భూమి పేదలకు పంపిణీ చేసే అంత వరకు ఈ పోరాటం ఆగదని తేల్చి చెబుతున్నారు పేదల చేస్తున్న పోరాటానికి అఖిలపక్ష పార్టీ నేతలు అండగా నిలిచారు చల్లపల్లి మండలం లక్ష్మీపురం శివారు చింతలమాడ డ్రైనేజీ పోరంబోకు భూమిని గతంలో అదే గ్రామానికి చెందిన దళితులకు ప్రభుత్వం మంజూరు చేసింది ఆ భూమిని తిరిగి పేదలు నుండి రెవెన్యూ యంత్రాంగం స్వాధీనం చేసుకుంది తర్వాత అదే భూమిని కొంతమంది ఆక్రమించుకొని గత కొన్ని సంవత్సరాల నుండి అనుభవిస్తున్నారు కొందరు వరి పంట సాగు చేయగా మరొకరు ఏకంగా భూమిలో చెరువు తవ్వి చేపల సాగు చేస్తున్నారు ఇంత జరుగుతున్నా అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరించడంతో ఆక్రమణదారులు రెచ్చిపోయి పెద్ద ఎత్తున భూమిని ఆక్రమించుకొని వారి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు ఇంతలో అఖిలపక్ష పార్టీ నేతలు చింతలమాడ కాలువ పోరంబోకు భూమి పేదలకు పంచాలని మా భూమి ఆక్రమణకు గురైందని వెంటనే రెవెన్యూ యంత్రాంగం స్వాధీనం చేసుకోవాలని ఆందోళన బాట పట్టారు ఒక దశలో భూమి లోనికి వెళ్లి పేదలు ఆ భూమిలో వ్యవసాయ పనులు చేశారు అప్పటినుండి నేటి వరకు ఆ భూమిని పేదలకు పంపిణీ చేయాలని అఖిలపక్ష పార్టీ నాయకులు డిమాండ్ చేస్తూనే ఉన్నారు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వ భూమి అని బోర్డులు కూడా ఏర్పాటు చేశారు ఎవరైనా భూమి లోనికి వెళితే చర్య తీసుకుంటామని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు అయినా ఆక్రమణదారులు ఎవరి పని వారు చేసుకుంటూ పోతున్న పట్టించుకోక పోవడంతో పేదల భూమి పేదలకు పంపిణీ చేయాలని అఖిలపక్ష పార్టీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.



## కొత్తపేట హైస్కూలు విద్యార్థికి జిల్లాస్థాయిలో ప్రథమస్థానం

చీరాల(ఒంగోలు) : కొవిడ్‌తో పాఠశాలలకు సెలవులొచ్చి, విద్యార్థులు ఇంటికే పరిమితమైన తరుణంలో, వారిలోని మేధస్సు, సామాజిక స్పృహను పెంపొందించేందుకు రాష్ట్ర జీవవైవిధ్య మండలి వారు, ఆన్లైన్లో నిర్వహించిన పోటీల్లో, వేటపాలెం కొత్తపేట హైస్కూలులో చదువుతున్న,షేక్ అహ్మద్‌అలీ, సత్తా చాటి వ్యాస రచన విభాగంలో, జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచాడు. దీనికి సంబంధించిన ప్రశంసాపత్రాలు ,పుస్తక బహుమతులు బుధ వారం ఉదయం చిన్నారి కి అందజేశారు. అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని, రాష్ట్ర జీవవైవిధ్య బోర్డు విద్యార్థులకు, ఆన్‌లైన్‌లో పోటీలు నిర్వహించగా, ఇందులో కవితల పోటీల్లో జిల్లాస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా మండల విద్యా శాఖాధికారి నాసిక ఏకాంబరేశ్వర రావు, స్కూల్ ఇంచార్జి నూనె నాగ వర్ధిని, శివ ప్రసాద్, పాలుట్ల దేవీసుధ, బండి బిక్షాలు బాబు, గుగ్గిలం శ్రీమన్నారాయణ,నాగేంద్ర ప్రసాద్, సీఆర్పీ బత్తుల సుజాత, జిల్లా గ్రీన్ మాస్టర్ ట్రైనర్ పవని. భానుచంద్రమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వై ఎస్ ఆర్ రైతు బజార్,ఫ్రూట్ మార్కెట్ కు శంకు స్థాపన చేసిన ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహన్ రావు



నందిగామ14జులై(ప్రజాపాలన: పట్టణంలో నగర పం చాయతీ సాధారణ నిధులు రూ. 16.00 లక్షల అంచ నా విలువతో చేపట్టనున్న రైతు బజార్ ఆధునీకరణ పనులు మరియు ఫ్రూట్ మార్కెట్ నిర్మాణ పనులకు శాసనసభ్యుడు మొండితోక జగన్ మోహన్ రావు శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగాఎమ్మెల్యే మా ట్లాడుతూ నందిగామ పట్టణాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళు తున్నా మని ,అందులో భాగంగానే పట్టణంలోని వై ఎస్ ఆర్ రైతు బజార్ ను ఆధునికరీంచటంతో పాటు ఫ్రూట్ మార్కెట్ ఏర్పాటు పనులకు కూడా శంకుస్థాపన చేశా మని తెలిపారు ,అదేవిధంగా రైతు బజార్ కు వచ్చే వినియోగదారులకు మరియు కూరగాయలు- పండ్లు అ మ్ముకునే వర్తకందారులకు ఇబ్బందులు లేకుండా ఆ ధునిక వసతులు కల్పిస్తున్నామని ,ఎన్నో ఏళ్లుగా రై తు బజార్ లో సరైన వసతులు లేకపోవడంతో పాటు పండ్లు అమ్ముకునేందుకు పట్టణంలో మార్కెట్ లేక వ్యాపారస్తులు ఇబ్బందులు పడుతున్నారని దీనిని దృష్టిలో ఉంచుకొనే ఫ్రూట్ మార్కెట్ ఏర్పాటు కూడా చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ ,వైస్ చైర్మన్, కమిషనర్ ,నగర పం చాయతీ కౌన్సిల్ సభ్యులు ,మున్సిపల్ అధికారులు ,రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ మరియు వైఎస్ఆర్ కాం గ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్టార్ టెక్ బయోమెట్రిక్ మిషన్లు గ్రామ వాలెంటీర్ లకు అందజేసిన గ్రామ సర్పంచ్



కంచికచర్లజులై14ప్రజాపాలన: మండలపరిధిలో కీస ర గ్రామ పంచాయతీ నందు బుధవారం నాడు స్టార్ టెక్ బయోమెట్రిక్ మిషన్లను గ్రామ వాలంటీర్లకు స ర్పంచ్ పేరం నరసమ్మ, ఉ ప సర్పంచ్ చలమల ప్రభా కర్, గ్రామ వైఎస్ఆర్సిపి నాయకులు పరిటాల కోటే శ్వరరావు (రాము) అందజేశారు. ఈ సందర్భంగా వా రు మాట్లాడుతూ గ్రామంలో ఫీవర్ సర్వే మరియు పింఛన్ల పంపిణీ మరియు ఇతర అనేక కార్యక్రమాలకు గ్రామస్తుల వేలి ముద్ర తప్పనిసరి అయినా నేప థ్యంలో పలు ఇబ్బందులు పడుతున్నామని గ్రామ వా లెంటర్లు తమ దృష్టికి తీసుకురాగా గ్రామ పంచాయ తీ పరిధిలో వాలెంటర్లుగా విధులు నిర్వహిస్తున్న వారికి 10 బయోమెట్రిక్ మిషన్ అందజేయడం జరి గిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ స ర్పంచ్ పేరం నరసమ్మ, ఉప సర్పంచ్ చలమల ప్రభా కర్, గ్రామ వైసిపి నాయకులు పరిటాల కోటేశ్వరరావు (రాము), మాజీ ఎంపీటీసీ సభ్యులు బాపట్ల స్వామి ,గ్రామ సచివాలయం సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ అం కిత తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ రైతు భరోసా రైతు చైతన్య యాత్ర

పెనుగంచి(ప్రోలు15జులై(ప్రజాపాలన) అనిగండ్ల పా డు గ్రామం లో వైఎస్సార్ రైతు భరోసా రైతు చైతన్య యాత్రలు గ్రామ సర్పంచ్ బి .జ్యోతి బ్రహ్మం అధ్య క్షతన గ్రామ పంచాయతీ కార్యాలయం నందు నిర్వ హించారు, ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి గా ఏ డి ఏ సిహెచ్.శ్రీనివాసరావు, మండల అగ్రికల్చర్ ఆఫీసర్ లక్ష్మి రెడ్డి, గరికపాడు వ్యవసాయ సైంటిస్ట్ బి వెంకటే శ్వర్లు, ఉ ద్యాన శాఖ అధికారి నీలిమ,గజేంద్ర పాల్గొ న్నారు, గ్రామంలోని రైతులందరూ పంట నమోదు చే యించుకోవాలని, ఇన్సూరెన్స్ చేయించుకోవాలని, ప్రతి ఒక్కరి కి ఆర్ బి కే లో నాణ్యమైన ఎరువులు వి త్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు దీనిని వినియోగించుకోవాలని కొనియాడారు, ఈ కార్యక్ర మంలో గ్రామ పార్టీ కన్వీనర్ గంగూరి. ప్రసాద్, సొసైటీ చైర్మన్ పిరికిటి. వెంకట కోటేశ్వరరావు,సచివాలయం అగ్రికల్చర్ అధికారులు శ్రీనివాసరావు, లావణ్య, గ్రామ నాయకులు,రైతులు వాలంటీర్లు పాల్గొన్నారు.



## రైతులందరూ భూసార పరీక్షలు చేయించుకోవాలి : వ్యవసాయ అధికారిణి ఎన్. మేరమ్మ




చినగంజాం(ఒంగోలు) : చినగంజాం మండలంలో కడవకుదురు గ్రామంలో డా.వైయస్ .ఆర్ రైతు చైతన్యయాత్రలు'' కార్యక్రమం వైస్ సర్పంచ్ నక్కల. శ్రీనివాసరావు అధ్యక్షతన, రైతు భరోసా కేంద్రం ఆవరణలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి ఎన్. మేరమ్మ మాట్లాడుతూ, రైతులు ఎన్ఎల్ఆర్-145, ఎన్ఎల్ఆర్-34449,యంటీయూ-1001 రకాలను వేయవద్దని, ప్రత్యామ్నాయంగా బి పి టీ-2595,ఎన్ఎల్ఆర్-33892, ఎన్ఎల్ఆర్-4001 రకాలను వేసుకోవాలని తెలిపారు. పంటలలో వచ్చే అగ్గి తగులు, మానిపండు, దోమను తట్టుకొనే రకాలను గురించి వివరించారు. వరి విత్తనాలను "సూడోమోనాస్ ఫ్లోరెన్సిస్ తో విత్తనశుద్ధి చేయటం వల్ల నారుమడుల్లో వచ్చే అగ్గితెగు లు తట్టుకుంటుందని తెలియజేసారు. గ్రామంలో రైతులందరూ భూసార పరీక్షలు చేయించుకోవాలని తెలియజేసారు. వరిలో వచ్చే జింక్ లోప నివారణకు "చిలామిన్ జింక్ " పొడిని 3సార్లు స్ప్రే చేయాలని , ఇలా చేయటం వల్ల జింక్ లోపం నివారించవచ్చునని అలాగే ఇనుపధాతు లోప నివారణకు అన్నభేది నిమ్మ ఉప్పును స్ప్రే చేయాలని తెలియజేసారు. గ్రామంలోని రైతులందరూ వేసిన పంటలను, పంటనమోదు చేయించుకోవాలని, పంటనమోదు వల్ల వచ్చేఉపయోగాలను వివరించారు. పంట సాగుదారు హక్కుపత్రాలు గురించి, వాటి ప్రయోజనాల గురించి వివరించారు. పంట సాగుదారు హక్కు పత్రం (సిసిఆర్‌సి) ఉన్న కౌలు రైతుకు డాక్టర్. వైఎస్సార్ రైతు భరోసా వస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ అధికారి బి కిరణ్ కుమార్ మాట్లాడుతూ, పశువులకు సంబంధించిన స్కీములను, పశువులకు వేసే చెవికమ్మలు గురించి,పశు గ్రాసాలు పెంచే విధానాలను, పచ్చగండి అయినటువంటి బహువార్షిక పంట సూపర్ నేపియర్ గడ్డిని వేసి, చిన్న చిన్న ముక్కలుగా పశువుల కు వేయాలని,పశువులకు వచ్చే వ్యాధుల గురించి, నివారణకు వేయించాల్సిన టీకాలగురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి ఎన్. మేరమ్మ, పశుసంవర్ధకశాఖ అధికారి బి. కిరణ్‌కుమార్, వైస్‌సర్పంచ్ నక్కల. శ్రీనివాసరావు, వివిఎ లు బి. కిషోర్, డి. దీవెన, విహెచ్ఏ పి. ప్రవీణ్‌కుమార్ మరియు రైతులు పాల్గొన్నారు.

## వైభవంగా పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్లు



చీరాల(ఒంగోలు) : చీరాల మండలం బోయినవారిపాలెంలో వేంచేసి ఉన్న పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్లు, గ్రామ ప్రజలు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో అతి వైభవంగా నిర్వహించడం జరిగింది. బోయిన వారి పాలెం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్ళు అతి అతి వైభవంగా గ్రామ ప్రజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు బోయిన కేశవులు మాట్లాడుతూ, అమ్మవారికి గ్రామంలో ఉన్న ప్రజలు వ్యవసాయపనులు మొదలు పెట్టే సమయంలో, అమ్మవారి తిరునాళ్ళు జరిగే అమ్మవారికి బోనాల పండగ నిర్వహించి, అమ్మవారికి పొంగళ్ళు నైవేద్యాలు సమర్పించి, అమ్మవారి ఆశీస్సులతో వ్యవసాయాన్ని మొదలు పెడతారని, అమ్మవారి ఆశీస్సులు గ్రామంపై ఎల్లవేళలా ఉంటాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బోయిన మోహన్ కృష్ణ. చప్పిడి వెంకటేశ్వర్లు. కోటి రవికుమార్. జంగిలి యేసు. బోయిన శివయ్య. తదితరులు పాల్గొన్నారు

## నిత్యాన్నదాన పథకంనకు నర్సిరెడ్డి లక్ష్మి రూ.2511 6/- లు విరాళం

జగ్గయ్యపేట15జులై(ప్రజాపాలన)జగ్గయ్యపేట మం డలం తిరుమలగిరి గ్రామములో వేంచేసియున్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్తానము



నందు జ రు గుచున్న నిత్యాన్నదాన పథకమునకు జగ్గయ్యపేట వాస్తవ్యులు ముల్లంగి నర్సిరెడ్డి లక్ష్మి రూ. 25116/- లు విరాళంగా ఇచ్చియున్నారు. వారికి ఆలయ సి బ్బంది మరియు అర్చకులు శ్రీ స్వామి వారి ప్రసాద ములు శేషవస్త్రములు అందజేసియున్నారు అని ఆల య సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణా ధి కారి ఎన్ ఎస్ చక్రధరరావు వారు తెలిపియున్నారు.

## తెలంగాణ నుండి జిల్లా లోకి అక్రమంగా తరలిస్తున్న 194 మద్యం సీసాలు పట్టివేత



జగ్గయ్యపేటజులై(ప్రజాపాలన) ఎస్పీ సిద్ధార్థ కౌశల్ ఆదేశాలు మేరకు, స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అడి షనల్ ఎస్పీ వకుల్ జిందాల్ ఆధ్వర్యంలో అక్రమ మ ద్యం రవాణా, అక్రమ ఇసుక రవాణా వంటివాటిపై నిరంతర నిఘా ఏర్పాటు చేస్తూ, అనునిత్యం మెరు పుదాడులు చేస్తూ అక్రమార్కుల గుండెల్లో సింహస్వ ప్నంగా మారారు జిల్లా పోలీసు యంత్రాంగంఈ క్రమం లో తెలంగాణ రాష్ట్రం నుండి జిల్లా లోకి అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను అందిన రహస్య సమా చారం మేరకు నందిగామ డిఎస్పి నాగేశ్వరరెడ్డి ప ర్యవేక్షణలో, సీ ఐ చంద్ర శేఖర్ ఆధ్వర్యంలో, చిల్లకల్లు ఎ స్ఐ లు కె . దుర్గా ప్రసాద్ మరియు పి .రమేష్ , వారి సిబ్బంది మల్కాపురం గ్రామ శివారు నందు ఆకస్మిక ముగా వాహనములు తనిఖీ చేసి తెలంగాణా నుండి ఆంధ్రాకు అక్రమంగా మద్యం బాటిల్స్ ను రవాణా చే యుచున్న గరిపాకుల నరసింహా రావు, ముదిగొండ మండలం, పెద్ద మండవ గ్రామానికి చెందిన అతనిని అరెస్ట్ చేసి అతని నుంచి %=o%.23,280/- విలువ చేసే 194 మద్యం బాటిల్స్ ను మరియు రవాణాకు ఉప యోగించిన ఒక మోటార్ సైకిల్ ను పోలీసులు స్వా దీన పరుచుకొనడమైనధి,సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతను ఎవరికి తరలిస్తున్నది విచారిస్తున్న ట్లు పోలీసులు తెలిపారు. నిందుతుడిపై కేసు నమో దు చేసి కోర్టుకు రిమాండు నిమిత్తం పంపుతున్నా మ ని విలేకరుల సమావేశంలో ఎస్ఐ దుర్గా ప్రసాద్ తెలిపారు.

## మద్యం అక్రమ రవాణా కు తెలివిగా చెక్ పెట్టిన పోలీసులు



వత్సవాయి15(ప్రజాపాలన): వత్సవాయి బోర్డర్ చెక్ పోస్ట్ వద్ద వత్సవాయి పోలీసు స్టేషన్ ఎస్ఐ, సిబ్బం ది కలిసి వాహనాలు తనిఖి చేయుచుండగా బోనకల్ వైపు నుండి ఒక కారు, రెండు బైక్ లపై వస్తున్న ఐదు గురు వ్యక్తులు యూనిఫారం లో ఉన్న పోలీసు వారిని చూసి వారి వాహనాలను వెనుకకు తిప్పి పారిపోవు టకు ప్రయత్నించగా ఎస్ఐ వారి సిబ్బంది సహాయం తో అదుపులోకి తీసుకొని వారినితీసుకువచ్చి ప్ర శ్నిం చారు,వారి పేర్లు 1.పండగ నాగార్జున , 2.నిమ్మకాయ ల చందన 3. షేక్ హుస్సేన్ 4. వేలదినేని సత్యప్ర సా ద్, 5).బంకా కనకరత్నం అందరిది వత్సవాయి మండ లం అని వీరు ఐదుగురు మంచి స్నేహితులు అయి నట్లు వీరు బాగా జల్సాలకు అలవాటు పడి వారి జ ల్సాలకు కావలసిన డబ్బులను తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో ఇ లాంటి నేరాలకు పాల్పడుతున్న ట్లు తెలిపారు ,దబ్బా కుపల్లి గ్రామ శివారులో కారు, బైక్ లపై ఉండి తెలం గాణా నుండి %ూ 16 దీఎ% 3844 నెంబర్ గల బైక్ పై వస్తున్న నందిగామకు చెందిన షన్ముఖ సాయి కు మార్ అనే అతనిని ఆపి మేము పోలీస్ లము అని చెప్పి అతనిని 50,000/- రూపాయలు డిమాండ్ చేయగా అతని వద్ద అంత డబ్బులు లేవు అని ఎ కౌంటు లో 7000/- రూపాయలు ఉన్నాయి అని అనగా అప్పుడు పండగ నాగార్జున అనే వ్యక్తి తన యొక్క 7799665956 నెంబర్ కి షన్ముఖ సాయి కు మార్ యొక్క 9154456643 అను నెంబర్ నుండి ఫోన్ పే చేయించుకొని, షన్ముఖ సాయి కుమార్ వద్ద ఉన్న 100 మద్యం బాటిల్స్ లో 50 వీరు ఐదుగురు తీసుకొని మిగిలిన 50 బాటిల్స్ ను షన్ముఖ సాయి కుమార్ కి ఇచ్చి అతనిని పంపినట్లు, అంతట నిన్న షన్ముఖ సాయి కుమార్ వద్ద తీసుకొన్న 50 బాటిల్స్ ని ఎవరికైనా అమ్మి మరల ఎక్కడయినా దారిలో ఎవరినైనా ఆపి వారివద్ద డబ్బులు వసూలు చేద్దామ ని వెళ్ళుచుండగా ఇంతలో పోలీసు వారు వచ్చి ప ట్టుకున్నారు అని చెప్పినారు,దానితో వారిని మధ్యవ ర్తుల సమక్షంలో అరెస్ట్ చేయడం జరిగినది. ఈ కేసు ను ఎంతో చాకచక్యంగా ఛేదించిన సిబ్బందిని నంది గామ డీఎస్పీ నాగేశ్వర్ రెడ్డి జగ్గయ్యపేట సీఐ చంద్రశే ఖర్ ప్రత్యేకంగా అభినందించారు.

# సంస్కరణలు ప్రజల కోసం... కార్పొరేట్ల కోసం కాదు




'మీరు సంస్కరణలకు అనుకూలమా, లేదా ప్రతికూలమా?' అని నిరంతరం అడుగుతుంటారు. ఏ సంస్కరణ కూడా సంపూర్ణం కాదు. ప్రతీ సంస్కరణకూ కొంత విషయం వుంటుంది, ఒక ప్రయోజనం వుంటుంది. వామపక్షాలు ఏ నిర్దిష్ట సంస్కరణకైనా మద్దతివ్వాలా లేక వ్యతిరేకించాలా అనేది ఇవి నిర్ణయిస్తాయి. ఈ సంస్కరణలనేవి మన ప్రజల ప్రయోజనాలకు ఉ పయోగపడతాయా, వారి జీవనోపాధులు, దేశ ఆర్థిక సార్వభౌమాధికారం బలోపేతం అవుతుందా అన్నదే ఇక్కడ కీలకమైన అంశంగా వుంటుంది. భారతదేశంలో ఆర్థిక సంస్కరణలు తీసుకువచ్చిన ఇన్ని దశాబ్దాల కాలంలో మా వైఖరి ఇలానే వుంటూ వచ్చింది. ఇకపై కూడా ఇలాగే కొనసాగుతుంది. మూడు దశాబ్దాలుగా భారతదేశంలో ఆర్థిక సంస్కరణలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో కొత్తగా తీసుకువచ్చిన మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా, కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ కల్పించాలంటూ మన రైతాంగం కనివినీ ఎరుగని రీతిలో పోరాటం కొనసాగిస్తూనే వుంది. శతాబ్దం క్రితం బలవంతంగా నీలిమందు మొక్కలను పెంచడానికి నిరసనగా జరిగిన చంపారన్ సత్యాగ్రహం స్మృతులు గుర్తుకు వస్తున్నాయి. కార్పొరేట్ వ్యవసాయం, చిన్న మొత్తాల్లో ఉత్పత్తిని దెబ్బతీయడం (మోడీ పెద్ద నోట్ల రద్దు), ఆహార కొరతలు...ఇవన్నీ కలిసి కరువు కాటకాలు పెంచేలా చేయవచ్చు. పేదలను పణంగా పెట్టి గరిష్ట స్థాయిలో లాభాలు ఆర్జించడం, పెరుగుతున్న దారిద్ర్యం, మరింతగా విస్తరిస్తున్న ఆర్థిక అసమానతలు, అన్ని దేశాల్లో తీవ్రంగా పడిపోయిన దేశీయ డిమాండ్ పైనే దశాబ్దాల తరబడి సంస్కరణలు ప్రధానంగా దృష్టి పెడుతూ వస్తున్నాయని అంతర్జాతీయ, భారతదేశ అనుభవాలు తెలియచేస్తున్నాయి. ప్రపంచ ఆర్థిక మాంద్యం, ప్రజల జీవితంపై దాని ప్రభావం వినాశకరమైన రీతిలో వుంది. ఇది, కరోనాతో మరింతగా పెరిగిపోయింది. ఇంకా ఆ ప్రభావం కొనసాగుతూనే వుంది. ఇది మార్క్స్ మాటలను గుర్తుచేస్తోంది: 'పెట్టుబడిదారీ విధానం భారీ ఉత్పత్తి, మారకపు మార్గాలను సమకూర్చుకుంది. ఇది క్షుద్ర ప్రపంచంలో మంత్రాలు, మాయలతో శక్తులను సృష్టించే మాంత్రికుడి లాంటిది. ఆ తరువాత వాటిని అదుపు చేయడంలో ఆ మాంత్రికుడు విఫలమవుతాడు.' అంతర్జాతీయ ఫైనాన్స్ పెట్టుబడి ఆధిపత్యంలోని నయా ఉదారవాద విధాన నిర్మాణంలో అంతర్భాగమే భారతదేశంలో సంస్కరణల క్రమం. ఇక్కడ గరిష్ట స్థాయిలో లాభాలు ఆర్జించడమే లక్ష్యం. ఇది, పెట్టుబడిదారీ విధానం యొక్క అత్యంత అధ్వాన్నమైన స్వభావాన్ని తెలియచేస్తోంది. జంతు స్ఫూర్తిని వెల్లడిస్తోంది. పెద్ద ఎత్తున ప్రభుత్వ ఆస్తులను, అన్ని ప్రభుత్వ సంస్థలను, సేవలను, ఖనిజ వ న ం ు ల న ు ప్రైవేటీకరించడానికి...ప్రజలపై యూజర్ చార్జీల భారాన్ని మోపడానికి దారితీసింది. నయా ఉ దారవాదమనేది అంతర్జాతీయంగా, భారత్‌లో కార్పొరేట్లకు పెద్ద లాభదాయకంగా మారింది. నయా ఉదారవాదం ప్రారంభమైనప్పటి నుండి సంపన్నులపై పన్నులు విధించడం అంతర్జాతీయంగా 79 శాతం తగ్గింది. 2008లో ఆర్థిక మాంద్యం తర్వాత, మూడేళ్ళ లోనే చాలామంది కోటీశ్వరులు తమ సంపదను పునరుద్ధరించుకున్నారు. 2018 నాటికి వారి సంపద రెట్టింపు అయింది. ఈ సంపద అంతా ఉత్పత్తి ద్వారా పెరగలేదు. తీవ్రంగా వున్న ఈ ఆర్థిక మాంద్యం స్టాక్ మార్కెట్లను ఎందుకు ప్రతికూలంగా ప్రభావితం చేయలేదో వివరించిన స్పెక్యులేషన్ ద్వారా పెరిగింది. మరోవైపు, ప్రపంచవ్యాప్తంగా 80 శాతం మంది ఆదాయం సంపాదించేవారు 2008 ముందు నాటి స్థాయికి కోలుకోలేదు. సంఘటిత రంగంపై, కార్మికవర్గ హక్కులపై దాడుల ఫలితంగా 1979లో ప్రతి నలుగురిలో ఒకరికి ప్రాతినిధ్యం వహించే కార్మిక సంఘాలు... ఈనాడు ప్రతి పదిమందిలో ఒకరికి మాత్రమే ప్రాతినిధ్యం వహించే స్థాయికి క్షీణించాయి.

భారత్ : అసమానతల పెరుగుదల

పర్యవసానంగా ఆర్థిక అసమానతలు పెరిగిపోయాయి. 'షైనింగ్ ఇండియా' (వెలిగిపోతున్న భారతదేశం) ఎల్లప్పుడూ సఫరింగ్ ఇండియా (బాధలు పడుతున్న భారతం) పైనే స్వారీ చేసేది. ఎ ె లి గి ఎ ో త ు న్న భారత్...కమిలిపోతున్న భారత్‌కు విలోమానుపాతంలో వుంటుంది. 2020 మార్చి నుండి భారతదేశం లోని వంద మంది కోటీశ్వరులు తమ ఆస్తులను రూ.12,97,822 కోట్లు పెంచుకున్నారు. అంటే దేశంలోని 13.8 కోట్ల మంది నిరుపేదలకు ఒక్కొక్కరికి రూ.94,045 చొప్పున చెక్ ఇవ్వగలిగేంత. కరోనా సమయంలో ముఖేష్ అంబానీ సంపాదించే మొత్తాన్ని ఒక నైపుణ్యం లేని కార్మికుడు సంపాదించాలంటే 10 వేల సంవత్సరాలు పడుతుంది. అంబానీ ఒక సెకనులో సంపాదించే మొత్తాన్ని ఈ కార్మికుడు మూడేళ్ళకు సంపాదిస్తాడని ఆక్స్‌ఫామ్ నివేదిక 'ది ఇనీక్వాలిటీ వైరస్' లోని తాజా భారత్ అనుబంధ నివేదిక పేర్కొంది. మరోవైపు, 2020 ఏప్రిల్‌లో ప్రతి గంటకు లక్షా 70 వేల మంది తమ ఉద్యోగాలను కోల్పోయారని గణాంకాలు తెలియచేస్తున్నాయి. లాక్‌డౌన్ సమయంలో భారత కోటీశ్వరుల సంపద 35 శాతం పెరిగింది. 2009 నుండి చూసినట్లైతే 90 శాతం పెరిగి 42.29 వేల కోట్లకు చేరుకుంది. వాస్తవానికి, కరోనా మహమ్మారి సమయంలో భారతదేశంలో అగ్రస్థానంలో వున్న 11 మంది కోటీశ్వరుల పెరిగిన సంపదతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పదేళ్ళపాటు లేదా ఆరోగ్య మంత్రిత్వ శాఖను పదేళ్ళపాటు నిర్వహించవచ్చు. పైస్థాయిలో వున్న 20 శాతం లోని 93.4 శాతంతో పోల్చుకుంటే...నిరుపేదలైన 20 శాతంలో కేవలం ఆరు శాతానికే మెరుగైన పారిశుధ్య వసరులు అందుబాటులో వున్నాయి. భారత జనాభాలో దాదాపు 59.6 శాతం మంది ఒక్క గది లోనో లేదా అంతకంటే చిన్న జాగా లోనో బతుకుతున్నారు. ప్రభుత్వ వ్యయం వాటాను బట్టి చూసినట్లైతే ప్రపంచంలోకెల్లా అత్యంత తక్కువ ఆరోగ్య రంగ బడ్జెట్ వున్న దేశాలలో భారత్ నాల్గవ స్థానంలో వుంది. కరోనా సమయంలో పెరిగిన తమ సంపదపై కనీసం ఒక శాతం పన్నును దేశంలోని పైస్థాయిలో వున్న 11 మంది కోటీశ్వరులు కట్టినా కూడా 'జన్ ఔషధి' పథకానికి కేటాయింపులను 140 రెట్లు పెంచడానికి సరిపోతుంది. ఈ పథకం వల్ల పేదలు, అట్టడుగు వర్గాల వారికి మందులు అందుబాటులో వుంటాయి. భారతదేశంలో దశాబ్దాలుగా అమలవుతున్న సంస్కరణలు ఆర్థిక అసమానతలను తీవ్రంగా పెంచుతున్నాయి. ప్రజలను దృష్టిలో వుంచుకుని వారికి అనుకూలమైన రీతిలో కాకుండా... పెట్టుబడిదారులు లాభాలు ఆర్జించే రీతిలో సంస్కరణలు తీసుకు వస్తున్నారు. సంపద సృష్టికర్తలను గౌరవించాలని ప్రధాని మోడీ మనకు ఉద్బోధిస్తున్నారు. సంపద అంటే విలువను డబ్బు రూపంలోకి మార్చడమే. ఆ విలువను సృష్టించేది కార్మిక వర్గమే. మన ప్రజల సర్వతోముఖ సంపదకు విలువను సృష్టించే వారిని గౌరవించాల్సిన అవసరముంది.

దారిద్ర్యం : అపార వృద్ధి

ప్రణాళికా సంఘాన్ని రద్దు చేయడంతో పాటు మోడీ ప్రభుత్వం, స్వాతంత్ర్యం సముపార్జించినప్పటి నుండి భారతదేశం అనుసరిస్తూ వచ్చినదాన్ని (దారిద్ర్య స్థాయిని లెక్కించడానికి మౌలికమైన పోషకాహార నిబంధనను) విడిచిపెట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో ఒక వ్యక్తికి రోజుకు 2200 క్యాలరీల పోషకాహారం వుండాలి. పట్టణ భారతంలో అయితే అది 2100 క్యాలరీలుగా వుండాలన్నది నిబంధన. దీని ప్రకారం చూసినట్లైతే 1993-94లో గ్రామీణ ప్రాంతాల్లో 58 శాతం మంది, పట్టణ ప్రాంతాల్లో 57 శాతం మంది ఈ దారిద్ర్య రేఖకు దిగువున వున్నారని ఎన్ఎస్ఎస్ నమూనా సర్వే తెలియచేస్తోంది. 2011-12లో మరోసారి నిర్వహించిన ఎన్ఎస్ఎస్ సర్వేలో ఈ శాతాలు వరుసగా 68, 65కు పడిపోయాయి. తిరిగి 2017-18లో మరోసారి విస్తృతంగా నమూనా సర్వే నిర్వహించారు. కానీ మోడీ ప్రభుత్వం వాస్తవాన్ని కప్పిపుచ్చేందుకు ఈ ఫలితాలను వెల్లడించకుండా తొక్కిపట్టింది. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మన డేటాబేస్ సంస్థలను కూడా ఈ ప్రభుత్వం నాశనం చేస్తోంది. గ్రామీణ భారతంలో తలసరి వాస్తవ వినిమయం వ్యయం (కేవలం ఆహారవే కాదు) కేవలం 9 శాతంగా మాత్రమే వుందని మీడియాకు లీకైన డేటా తెలియచేసింది. కరోనా మహమ్మారి తలెత్తడానికి ముందుగానే గ్రామీణ, పట్టణ భారతాల్లో సంపూర్ణ స్థాయిలో దారిద్ర్యం అనూహ్యంగా పెరిగిందన్నది సుస్పష్టం. అప్పటి నుండి పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారింది. కోవిడ్ మహమ్మారి విజృంభణ...ప్రజల ప్రాణాలను, వారి ఉపాధులను కాపాడేందుకు అరకొరగా వున్న ఆరోగ్య సంరక్షణ సదుపాయాల ఇబ్బందులు... పరిస్థితులను బహిర్గతం చేశాయి. ఈనాడు మనం ఎదుర్కొంటున్న తీవ్ర ఆర్థిక మాంద్యం అంతర్జాతీయ నయా ఉ దారవాద విధానంలో భాగమే. ఏదోవిధంగా ప్రజలను తీవ్ర స్థాయిలో దోపిడీ చేయడం ద్వారా లాభాలను గరిష్టంగా ఆర్జించాలన్నదే ఈ నయా ఉదారవాద విధానం. పొదుపు చర్యల నుండి వేతనాల్లో కోతల వరకు, ఉద్యోగాల లేఆఫ్‌లు, మరీ ముఖ్యంగా చిన్న స్థాయిలో ఉత్పత్తిని దెబ్బ తీయడం (భారత్‌లో ఇది పెద్ద నోట్ల రద్దు ద్వారా జరిగింది) వంటి చర్యల ద్వారా ప్రజలను దోపిడీ చేస్తారు. ఆర్థిక కార్యకలాపాలకు సంబంధించిన అన్ని మార్గాలను ఆక్రమించుకోవడం, ఇప్పుడు కార్పొరేట్ లబ్ధి కోసం భారత వ్యవసాయ రంగాన్ని నాశనం చేయడం, కాంట్రాక్ట్ వ్యవసాయం, ఫలితంగా ఆహార కొరత వంటివి ఈ విషయాన్ని మనకు స్పష్టంగా తెలియచేస్తున్నాయి.

ఈనాడు, అంతర్జాతీయ ఆకలి సూచీ భారత్‌ను 'తీవ్రమైన కేటగిరీ'లో నిలిపింది. పోషకాహార లోపం ప్రమాదకర స్థాయిలో పెరిగిపోతోందని, మరీ ముఖ్యంగా పిల్లల్లో ఇది ఎక్కువగా వుందని, ఫలితంగా శిశు మరణాలు ఎక్కువగా నమోదవుతున్నాయని ఎ న్ ఎ ఫ్ ెహ చ్ ఎ న్ - 5 తెలియచేసింది.

మతోన్మాదం-కార్పొరేట్ల బంధం

2014 తరువాత కార్పొరేట్, మత రాజకీయాల యొక్క విషపూరిత బంధం ఆవిష్కృతమైంది. జాతీయ ఆస్తులను దోపిడీ చేయడం ద్వారా గరిష్టంగా లాభాలను ఆర్జించడమన్నది చాలా దూకుడుగా అమలు చేశారు. ప్రభుత్వ రంగాన్ని పెద్ద ఎత్తున ప్రైవేటీకరించారు. ప్రభుత్వ సంస్థలను, గనులను కూడా ప్రైవేటీకరించారు. ఫలితంగా అనూహ్యమైన స్థాయిలో ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం, రాజకీయ అవినీతి పెరిగిపోయింది. దీనికి తోడు ప్రజల ప్రజాస్వామ్య హక్కులపై, పౌర హక్కులపై, మానవ హక్కులపై నిర్దాక్షిణ్యంగా దాడులు చేశారు. అసమ్మతివాదులందరినీ జాతి వ్యతిరేకులుగా ముద్ర వేశారు. నిరంకుశ యుఎపిఎ, దేశద్రోహ చట్టం కింద ప్రజలను నిర్దాక్షిణ్యంగా అరెస్టు చేయడం మొదలుపెట్టారు. ఈ క్రమం ఇటు భారత రాజ్యాంగాన్ని, అటు ప్రజలకు ఇచ్చిన హామీలను దెబ్బతీసింది. ప్రపంచ ఆర్థిక స్వేచ్ఛా సూచీ (గ్లోబల్ ఎకనామిక్ ఫ్రీడం ఇండెక్స్) భారత్‌ను 105వ స్థానంలో నిలిపింది. గతేడాది కన్నా ఇది అధ్వాన్నమైన స్థితి. గతేడాది 79వ స్థానంలో వుంది. మానవ హక్కుల సూచీలో భారత్ 94 నుండి 111కి పడిపోయింది. యుఎన్‌డిపి మానవ వికాస సూచీ మనల్ని ఇంకా కిందకు...అంటే గతేడాది వున్న 129 నుండి 131వ స్థానానికి దింపేసింది.

మెజారిటీ ప్రజలకు పెరుగుతున్న ఇబ్బందులతో పాటుగా పెరుగుతున్న నియంతృత్వం...ముస్సోలిని ఫాసిజానికి చెప్పిన నిర్వచనం 'పాలనతో కార్పొరేట్ల కలయికకు' దగ్గరగా ఉంది.

ఆర్థిక వ్యవస్థలను పునరుద్ధరించడంలో నూతన ఆర్థిక విధానాలు విఫలమయ్యాయన్న సంగతి ప్రపంచవ్యాప్తంగా గుర్తించబడుతోంది. అసమానతలు వృద్ధికి ఆటంకం కలిగించి, అసమర్ధతను పెంచే స్థాయికి చేరుకున్నాయి' అని 'ది ఎకానమిస్ట్' పత్రిక పేర్కొంది.

నయా ఉదారవాద సంస్కరణల దివాళా

పెద్ద ఎత్తున ప్రభుత్వ వ్యయాలతో కూడిన ఉద్దీపన ప్యాకేజీలను అభివృద్ధి చెందిన దేశాలన్నీ ప్రకటించాయి. ఇవి నయా ఉదారవాదానికి శాపంగా పరిణమిస్తాయి. దేశీయ డిమాండ్‌ను, ఆర్థిక కార్యకలాపాలను పునరుద్ధరించడానికి ఈ చర్యలు ఉద్దేశించబడ్డాయి. "నేను కమ్యూనిస్టును కాను, కానీ...." అంటూ ప్రభుత్వ వ్యయం పెంచడాన్ని సమర్థిస్తూ ఇటీవలే బ్రిటీష్ ప్రధాని బోరిస్ జాన్సన్ ప్రసంగించారు. అయితే, మోడీ ప్రభుత్వం మాత్రం ప్రభుత్వ వ్యయం పెంచడం గురించి ఎక్కువగా మాట్లాడడం లేదు. కానీ తన ఆశ్రితులు చెల్లించని పెద్ద మొత్తంలోని రుణాలను మాత్రం రద్దు చేస్తోంది. రోజువారీ పెట్రో ధరల పెంపు ద్వారా ప్రజలపై భారాలు మోపుతోంది. ఫలితంగా ద్రవ్యోల్బణం పెరిగిపోతోంది. దీనివల్ల దేశీయ డిమాండ్ మరింతగా క్షీణిస్తోంది. ఫలితంగా ఆర్థిక మాంద్యం పెరుగుతోంది. భారత్‌లో ఈ సంస్కరణల పంథాను మనం తీవ్రంగా పరిశీలించుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది. మన ప్రాధాన్యాలేంటనేది పునఃనిర్వచించుకోవాల్సి వుంది. వ్యవసాయాన్ని బలోపేతం చేయాలి. ఆహార భద్రతను పటిష్టపరచాలి. ఆరోగ్యం, విద్యపై పెట్టుబడి పెంచాలి. ప్రస్తుతం మనకు ఎంతగానో అవసరమైన-ఆర్థిక, సామాజిక-మౌలిక సదుపాయాల నిర్మాణంపై ప్రభుత్వ పెట్టుబడులు పెద్దఎత్తున పెరగాలి. అప్పుడే ఉ ద్యోగాలు సృష్టించబడతాయి. దేశీయ డిమాండ్ పెరుగుతుంది. కేవలం మానవతావాద ఆందోళనలతోనే కాకుండా, సమానమైన ఆర్థిక పునరుద్ధరణకు కూడా ఇదొక్కటే మార్గం. అస్పష్టత, అహేతుకత, మన సమాజాన్ని అమానవీయం చేసేలా, మన సామాజిక సామరస్యతను దెబ్బ తీసే అన్ని విచ్ఛిన్నకర ధోరణులను తిరస్కరించడం అన్నింటికంటే ముఖ్యమైనది. ప్రజా ప్రయోజనాలోలకమైన అటువంటి సంస్కరణలు ఈనాడు భారతదేశానికి అవసరం. అంతేగానీ కార్పొరేట్ లాభార్జనే ధ్యేయంగా గల సంస్కరణలు కాదు. ఇటువంటి సంస్కరణల దిశను సాకారం చేయగలిగే వేదిక ప్రజా పోరాటాలను బలోపేతం చేస్తుంది. ప్రత్యామ్నాయ సంస్కరణల పంథాను సూచించగల ప్రజా ఉ ద్యమాలు, సమీకరణలు తగినంత బలాన్ని పుంజుకోవాల్సి వుంది. మన ప్రజలపై మరిన్ని భారాలను మోపుతున్న, వారిని దెబ్బ తీస్తున్న భారత పాలక వర్గాల ప్రస్తుత దిశను మార్చగలిగేలా ఈ ఉ ద్యమాలు వుండాలి. భారతదేశంలోని మూడు దశాబ్దాల సంస్కరణల క్రమం సరైన దిశ లోకి మారడానికి ఇదే సముచితమైన సమయం.

# వర్షాకాలం వ్యాధులకు దూరంగా...



కొవిడ్ సెకండ్ వేవ్ నుంచి ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నాం! ముందున్న మూడో వేవ్‌ను వ్యాక్సిన్‌తో ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం! అయినప్పటికీ ప్రస్తుత చల్లని వాతావరణం అన్ని వైరస్‌లకు అనుకూలమైనది! కాబట్టి కరోనాతో సహా, ఎటువంటి వ్యాధికారక సూక్ష్మజీవులూ సోకకుండా శరీరాన్ని దృఢపరుచుకోవాలి! అందుకోసం సమర్ధమైన ఆయుర్వేద చికిత్సలను ఆశ్రయించవచ్చు!

వర్ష రుతువుతో వాతావరణంలోని క్షారం దేహ వాతాన్ని పెంచి, పిత్తం పేరుకునేలా చేసి శక్తిని కుంటుపరుస్తుంది. ఫలితంగా శరీర కణజాలం బలహీనపడి, రోగనిరోధకశక్తి సన్నగిల్లి పలురకాల ఎలర్జీలు, ఉదర సంబంధ సమస్యలు, శ్వాసకోశ సమస్యల బారిన పడేలా చేస్తుంది. జీర్ణాగ్ని ఈ రుతువులో కుంటుపడుతుంది. కాబట్టి ఈ సమస్యలకు గురి కాకుండా ఉండాలంటే శుద్ధి, పునరుత్తేజ చికిత్సలతో శక్తి పుంజుకోవడంతోపాటు వాత, పిత్త, కఫాల సమతౌల్యం కోసం దోహదపడే ఆహారం, జీవన విధానాలను అనుసరించాలి.

వర్ష రుతువులో శరీరంలోని త్రిదోషాలు విపరీతస్థితికి చేరుకుంటాయి. ఈ స్థితి నుంచి వీటిని సమతుల్యపరచాలి. లేదంటే వ్యాధుల రూపంలో అవి విజృంభిస్తాయి. వర్షాలు, వర్షాలతో పాటు చోటు చేసుకునే చల్లని వాతావరణం వ్యాధులకు మూల కారణం. వర్ష రుతువులో బలహీనపడే దేహాగ్ని కారణంగా త్రిదోషాల మధ్య అసమతౌల్యం చోటు చేసుకుంటుంది. కాబట్టి వాతరోగాలైన ఆర్థ్రయిటిస్, రుమటాయిడ్ ఆర్థ్రయిటిస్, సయాటికా, వెన్ను నొప్పి, మెడ ఎముకల నొప్పి, నాడీసంబంధ సమస్యలు ఈ కాలంలో పెరుగుతాయి. కఫ దోషం ఎక్కువవడం మూలంగా జలుబు, దగ్గు, ఎలర్జీలు, చర్మసంబంధ రుగ్మతలు పెరుగుతాయి.

**ఆయుర్వేద చికిత్సలు**

ఆయుర్వేద చికిత్సలో ఎలాంటి రుగ్మతకు చికిత్స చేయాలన్నా, దాన్ని పంచకర్మ అంటారు. దాని ఫలితం పూర్తిగా శరీరానికి దక్కాలంటే ముందుగా శరీరాన్ని విషరహితంగా మార్చాలి. ఇందుకోసం 'పూర్వకర్మ' చికిత్సను అనుసరించక తప్పదు. ఈ చికిత్సలో భాగంగా దేహాన్ని విషరహితంగా మార్చడం కోసం బాహ్యంగా, అంతర్గతంగా తైలాలను వాడతారు. బాహ్యంగా తైల మర్దన చేయవలసి ఉంటుంది. అంతర్గతంగా తైలాలను తాగవలసి ఉంటుంది. తైల మర్దన చికిత్సలన్నీ రోగుల రుగ్మతలు, వారి శరీర తత్వాల ఆధారంగా ఎంచుకోవలసి ఉంటుంది. చికిత్సల్లో కొన్ని నిర్దిష్ట నూనెలు, చూర్ణాలు, మర్దన పద్ధతులు అనుసరిస్తారు. వీటిని ఆయుర్వేద తైల చికిత్సలు అంటారు. వీటిని శరీర తత్వం (వాత, పిత్త, కఫ), రుగ్మతల ఆధారంగా ఆయుర్వేద వైద్యులు సూచిస్తారు. అవేంటంటే....

**అభ్యంగ**

సాధారణంగా మనం ఇంట్లో కూడా తైల మర్దన చేసుకుంటూ ఉంటాం. దీని ప్రధమ ఉద్దేశం రక్తప్రసరణ పెరుగుదల, కండరాలు, చర్మ పటుత్వాలే! మర్దన వల్ల శరీరంలోని మలినాలు కూడా విసర్జితమై శక్తి పెరుగుతుంది. నిద్ర పడుతుంది. ఇలా ఒళ్లంతా నూనె పట్టించి మర్దనా చేసి, సున్ని పిండితో రుద్ది స్నానం చేసే పద్ధతిని ఆయుర్వేదంలో 'అభ్యంగనం' అంటారు. ఇది ఎవరైనా చేయొచ్చు. అయితే ఆయుర్వేద చికిత్సలో భాగంగా పూర్వకర్మ అభ్యంగనను ముందుముందు చికిత్సకు శరీరాన్ని సంసిద్ధం చేయడం కోసం చేస్తారు.

**ఉద్వర్తనం**

ఈ మర్దన పురుషుల కోసం ఉద్దేశించినది. ఏమాత్రం తడి లేకుండా పూర్తిగా చూర్ణాలతో సాగే ఈ మర్దన సున్నిత చర్మం కలిగి ఉండే మహిళలకు పనికి రాదు. కాబట్టి ఉద్వర్తనం మినహా ఉద్ఘర్షణం, ఉత్సాదనం మర్దనలు మాత్రమే మహిళలకు ఉద్దేశించినవి. పిల్లల చర్మం మరింత సున్నితంగా ఉంటుంది కాబట్టి పూర్తి నూనెలతో సాగే ఉత్సాదనం మర్దన ఒక్కటే వారికి అనుసరించవలసి ఉంటుంది. ఈ చికిత్సతో రక్తప్రసరణ, మెటబాలిక్ రేట్ (శరీరం శక్తిని ఖర్చు చేసే వేగం), మరీ ముఖ్యంగా కొవ్వు కరిగే వేగం పెరుగుతాయి.

**ఉద్ఘర్షణం**

ఇది తడి చూర్ణాలతో చేసే మర్దన. కీళ్ల దగ్గర వృత్తాకారంలో, ఎముకల దగ్గర పొడవుగా సాగే ఈ మర్దన రెండు రకాల మర్దన పద్ధతుల్లో సాగుతుంది. కఫ తత్వ లక్షణాలైన అధిక బరువు, ఒంట్లో నీరు నిల్వ ఉండిపోవడం, నిస్తేజం, రక్తప్రసరణ లోపం ఉన్న వారికి ఉద్ఘర్షణం వల్ల ఫలితం ఉంటుంది. దీర్ఘకాలంలో శరీరంలోని కలుషితాలన్నీ విరిగి రక్తప్రవాహంలో కలుస్తాయి. ఫలితంగా కొవ్వు కూడా కరగడం మొదలు పెడుతుంది.

**ఉత్సాధనం**

వేర్వేరు నూనెల మిశ్రమంతో చేసే మర్దన

**శిరోధార**

ఈ చికిత్సలో శరీరానికి తైల మర్దన చేసి, ఆ తర్వాత నుదుటి మీద తైలం చుక్కలుగా పడే చికిత్స చేస్తారు. ఇలా నూనె నేరుగా నుదుటి మీద పడడం వల్ల మెదడులోని పిట్యూటరీ గ్రంథి పనితీరు మెరుగవుతుంది. శిరోధార చికిత్సను క్రమంతప్పక తీసుకుంటే మెదడులో సెరటోనిన్, డోపమైన్ హార్మోన్లు సక్రమంగా స్రవిస్తాయి. పార్కిన్సన్ రుగ్మతలో డోపమైన లెవెల్స్ తగ్గుతాయి. అలాంటివాళ్లకి ఈ చికిత్స ఫలితమిస్తుంది. శిరోధార వల్ల కార్టిసాల్, సెరటోనిన్ స్రావాలు మెరుగవుతాయి. కాబట్టి ఒత్తిడి వల్ల తలెత్తే రుగ్మతలకు ఈ చికిత్స చక్కని ఫలితాలనిస్తుంది. నిద్రలోపం కూడా తొలగుతుంది.

**కషాయధార**

చూర్ణాలతో తయారైన కషాయాన్ని శరీరం మీద ఒంపి, నొప్పులు, వాపులను తొలగించే చికిత్స ఇది. సమమైన వేడితో ఉన్న కషాయాన్ని శరీరం మీద, రెండు వైపులా ఒకే దిశలో పోస్తూ ఈ చికిత్స చేస్తారు. వాపులు, నొప్పులు ఉన్నప్పుడు ఈ చికిత్స చేయించుకోవడం వల్ల కషాయంలోని మూలికలు ఆ నొప్పులకు కారణాలను నేరుగా చేరుకుని చికిత్స చేస్తాయి. ఊపిరితిత్తుల్లో, పొట్టలో నీరు పేరుకుపోయే ఎడిమా సమస్యకూ ఈ చికిత్స చక్కని ఫలితం ఇస్తుంది.

**కాయసేగం**

శరీరం మొత్తాన్నీ తైలాలతో మర్దన చేసే ఈ చికిత్స వల్ల నాడీ వ్యవస్థ బలపడుతుంది. పక్షవాతం, మస్క్యులర్ డిస్ట్రోఫీ సమస్యలకు కాయసేగం ఫలితాన్నిస్తుంది.

**ఆయుర్వేద మర్దనలో వాడే నూనెలు, చూర్ణాలు**

వ్యాధి, శరీర తత్వం ఆధారంగా మర్దన కోసం ఉపయోగించవలసిన నూనెలు, చూర్ణాలు ఎంచుకోవలసి ఉంటుంది. కాబట్టి మర్దన నూనెల్లో లెక్కలేనన్ని రకాలు వాడుకలో ఉన్నాయి. అయితే పొడుల్లో ఔషధంలా తీసుకునే పొడులు బోలెడన్ని. శరీరం మీద మర్దనకు వాడేవి మూడు లేదా నాలుగు రకాలుంటాయి. వీటిలో...

కోలగులతాది చూర్ణం: కొవ్వును కరిగించడంతోపాటు, కొవ్వు కరిగే వేగాన్ని పెంచి, అధిక బరువును తగ్గిస్తుంది.

త్రిఫలాది చూర్ణం: రక్తప్రసరణ మెరుగవుతుంది.


జడామయాది చూర్ణం: కీళ్ల నొప్పులు తగ్గుతాయి.

ఏలాది చూర్ణం: చర్మ సంబంధ సమస్యలకు ఉపయోగకరం.

**వేడి నూనె, చూర్ణం**

గోరువెచ్చని నూనెను చర్మం తేలికగా పీల్చుకుంటుంది. కాబట్టి మర్దన కోసం వాడే నూనెను వేడి చేస్తారు. అయితే ఈ నూనెను పొయ్యి మీద ఉంచి నేరుగా వేడి చేయకూడదు. గిన్నెను వేడి చేసి, పొయ్యి నుంచి దింపి, ఆ తర్వాత దాన్లో నూనె నింపవలసి ఉంటుంది. నూనె చల్లారిపోతే, తిరిగి గిన్నె ఖాళీ చేసి వేడి చేసి, నూనెను నింపాలి. ఇలా చేయకుండా నూనెను నేరుగా పొయ్యి మీద ఉంచి వేడి చేసినా, అదే పద్ధతిలో పదే పదే వేడి చేసినా తైలంలోని విలువైన ఔషధ గుణాలు నష్టమవుతాయి. చూర్ణాలను చిన్న మంట మీద వేడి చేయాలి.

## మధుమేహులూ జాగ్రత్త



మధుమేహులకు కొవిడ్ సోకడం మూలంగా తలెత్తే రుగ్మతలు భిన్నంగా ఉంటాయి. సత్వరం, సమర్థమైన చికిత్స తీసుకోగలిగితే ఈ రుగ్తల నుంచి పూర్తిగా కోలుకునే వీలుంటుంది. డయాబెటిక్ కీటోఅసిడోసిస్: అదుపు తప్పిన మధుమేహం ఉన్నవారికి కొవిడ్ సోకడం మూలంగా డయాబెటిక్ కీటోఅసిడోసిసకు గురవుతారు. వీరి రక్తంలో కీటోన్స్ అనే యాసిడ్లు విపరీతంగా పెరిగిపోతాయి. ఈ పరిస్థితి ప్రాణాంతకం. మ్యూకోర్‌మైకోసిస్: అదుపుతప్పిన మధుమేహానికి కొవిడ్ జతైతే, మ్యూకోర్‌మైకోసిస్ తప్పదు. అత్య?ధిక చక్కెర స్థాయిలు, కొవిడ్ చికిత్సలో భాగంగా వాడిన స్టిరాయిడ్లు, కొవిడ్ ఇన్‌ఫెక్షన్... ఈ మూడూ తోడైనప్పుడు ఇమ్యూనిటీ స్థాయి తీవ్రంగా పడిపోయి, మ్యూకోర్‌మైకోసిస్ బారిన పడే అవకాశాలు పెరుగుతాయి.

న్యుమోనియా: కొవిడ్ 19 బారిన పడిన మధుమేహుల్లో చక్కెర స్థాయి నియంత్రణ తప్పితే, కొవిడ్ 19తో కూడిన న్యుమోనియా తలెత్తే అవకాశాలు కూడా ఎక్కువగా ఉంటాయి.

కాబట్టి మధుమేహులు కొవిడ్ కాలంలో మరింత అప్రమత్తంగా నడుచుకుంటూ మధుమేహాన్ని మందులతో, ఆరోగ్యకరమైన జీవనశైలితో అదుపులో ఉంచుకోవాలి.

## వ్యాక్సిన్‌తో గుండె ఇన్‌ఫ్లమేషన్!

ఇంజెక్షన్ ఇచ్చిన ప్రదేశంలో నొప్పి, వాపు, జ్వరం, తలనొప్పి మొదలైన వ్యాక్సిన్ దుష్ప్రభావాలు కొందర్లో కనిపించడం సహజం. అయితే కొందరిలో అరుదుగా రక్తం గడ్డ కట్టే సమస్య కూడా తలెత్తుతోంది. దీనితో పాటు ఇంకొందర్లో మయోకార్డైటిస్ (గుండె కండరం వాపు), పెరికార్డైటిస్ (గుండెను కప్పి ఉంచే పొర ఇన్‌ఫ్లమేషన్) సమస్యలు తలెత్తే అవకాశాలు కూడా ఉంటాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ తాజాగా స్పష్టం చేసింది. మరీ ముఖ్యంగా మోడర్నా, ఫైజర్ వ్యాక్సిన్లతో యువతలో గుండెకు సంబంధించిన రెండు రకాల ఇన్‌ఫ్లమేషన్లు తలెత్తే అవకాశాలు ఉంటున్నాయని డబ్ల్యుహెచ్ఓ చెబుతోంది. మిగతా వ్యాక్సిన్లతో పోలిస్తే, ఈ రెండు వ్యాక్సిన్లతోనే గుండెకు సంబంధించిన దుష్ప్రభావాలు కనిపించే అవకాశాలు ఎక్కువ. ఈ రకమైన దుష్ప్రభావాలు రెండో డోసు వ్యాక్సిన్ వేయించుకున్న కొద్ది రోజుల్లోనే మొదలవుతాయని కూడా ప్రపంచ ఆరోగ్య సంస్థ ఓ ప్రకటనలో స్పష్టం చేసింది.అయితే ఇలాంటి సందర్భాలు అత్యంత అరుదనీ, ప్రాణాంతక కొవిడ్ ఇన్‌ఫెక్షన్‌తో పోల్చుకుంటే, వ్యాక్సిన్ తదనంతర దుష్ప్రభావాలతో జరిగే ఆరోగ్య నష్టం తక్కువే కాబట్టి తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించుకోవాలని కూడా ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచిస్తోంది. రెండో డోసు వేయించుకున్న వెంటనే గుండెకు సంబం?ధించిన స్వల్ప అస్వస్థత తలెత్తితే ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రతించడం అవసరం.

## జీకా వైరస్‌కు అడ్డుకట్ట



వర్షాకాలం డెంగూ మొదలు చిగున్‌గున్యా వరకూ పలు రకాల సీజనల్ వ్యాధులు దాడి చేస్తూ ఉంటాయి. అయితే డెంగూ, మలేరియాలకు అడ్డుకట్ట వేయడం ద్వారా జీకా వైరస్ వ్యాప్తినీ తగ్గించవచ్చని వైద్యాధికారులు చెబుతున్నారు.కేరళలో ఇప్పటివరకూ 18 జీకా వైరస్ కేసులు నమోదవడంతో మిగతా రాష్ట్రాలన్నీ అప్రమత్తమయ్యాయి. తలనొప్పి, జ్వరం, దద్దుర్లు, కళ్ల కలక, కీళ్లు, కండరాల నొప్పులు మొదలైన లక్షణాలు కలిగి ఉండే జీకా వైరస్ ఇన్‌ఫెక్షన్ రెండు నుంచి ఏడు రోజుల పాటు వేధిస్తుంది. ఎక్కువ మందిలో ఎటువంటి లక్షణాలు కనిపించకపోవచ్చు. అయితే గర్భిణులకు జీకా వైరస్ సోకడం వల్ల మైక్రోసెఫాలీ అనే మెదడు సంబంధించిన లోపంతో బిడ్డ పుట్టే అవకాశాలు ఉంటాయనీ, దీన్నే కంజెనైటల్ జీకా సిండ్రోమ్ అంటారనీ ప్రపంచ ఆరోగ్య సంస్థ స్పష్టం చేసింది.కాబట్టి వర్షాకాలంలో వ్యాధికారక సూక్ష్మక్రిముల వ్యాప్తికి వీలుండకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచిస్తోంది. ఇందుకోసం ఇంట్లో, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం అవసరం. ఖాళీ షాంపూ సీసాలు, కొబ్బరి చిప్పలు, టైర్లు మొదలైన నీళ్లు నిల్వ ఉండే వీలున్న వస్తువులను ఇంటి పరిసరాల్లో ఉండకుండా చూసుకోవాలి. కూలర్లలో మిగిలిపోయిన నీటిని తొలగించి, శుభ్రంగా ఉంచుకోవాలి. తేమ లేకుండా, ఇంట్లో పొడి వాతావరణాన్ని కల్పించాలని వైద్యులు సూచిస్తున్నారు.


మాస్టర్ కీ TV
(అంబేద్కర్ TV)

జై భీం,
మీరు నాయకుడిగా ఎదగాలని అనుకుంటున్నారా...?
మీరనుకున్న వార్తలు రావాలని కోరుకుంటున్నారా...?
పెట్టుబడి లేకుండా ఆదాయం పొందాలని అనుకుంటున్నారా...?
మీరూ మీ అసెంబ్లీ నియోజకవర్గం లో
టీవీ ఛానల్ ఓనర్ గా కావాలని అనుకుంటున్నారా...?

అయితే రండి, కదలి రండీ

బహుజనాభివృద్ధే.. దేశాభివృద్ధి అని నిరూపిద్దాం

1. ఈ దేశంలో ఉన్న ఫోర్త్ ఎస్టేట్ (మీడియా రంగం) బహుజనుల సమస్యల మీద ప్రచారం చేయడం లేదని మీ అందరికీ తెలుసు. దేశంలోనే మొట్ట మొదటిసారిగా విలేఖరులకు సామాజిక కార్యకర్తలకు, అంబేడ్కర్, పూలే సంఘం నాయకులకు, కనీసం 100 మంది తెలిసిన గ్రూపునాయకులకు టీవీ ఛానల్ ప్రతినిధిగా / యజమానిగా అవకాశం ఇవ్వబడును.
2. జీవిత కాలంలో ఆయా అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రతినిధిగా / యజమానిగా నియమించబడును.
3. ఆయా ప్రతినిధికి ప్రకటనల ఆదాయం (Advertising Revenue)లో ప్రకటనలపై 40% ఆదాయం ఇవ్వబడును.
4. వార్తలను స్వేచ్ఛాయుతంగా ప్రసారం (Telecast) చేసే వీలు కల్పించబడును.

సంప్రదించండి

Tel No: 9849031420 ,9440918143, 94409 18371, 94400 53858, 93473 50692,8008840506, 9440077239, 7798832998, 76600 27678,


Office: Ambedkar TV Channel, 3rd Floor, Dault Plaza, Main Road, Besides Bata Showroom, Lakdi ka pool, Hyderabad - 500004

E-mail : ambedkartvchannel2018@gmail.com www.ambedkartv.org

# నవరస నుండి థర్డ్ సింగిల్ విడుదల కి సిద్ధం!




మణిరత్నం క్రియేషన్ లో వస్తున్న నవరస వెబ్ సిరీస్ పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇప్పటికే నవరస వెబ్ సిరీస్ కి సంబంధించిన పోస్టర్లు, వీడియోలు కొన్ని విడుదల అయ్యాయి. అయితే ప్రతి ఒక్క పోస్టర్ ఈ వెబ్ సిరీస్ పై మరింత ఆసక్తి రేపేలా ఉన్నాయి. అయితే ఈ వెబ్ సిరీస్ కి సంబందించిన మరొక క్రేజీ సాంగ్ విడుదల కి సిద్దం అవుతుంది.అయితే విజయ్ సేతుపతి, రేవతి, ప్రకాష్ రాజ్ లు ప్రధాన పాత్రల్లో బిజొయ్ నంబియార్ దర్శకత్వం వహించిన ఎపిసోడ్ ఎదిరి. ఎదిరి కరుణ రసం. అయితే ఈ ఎపిసొడ్ నుండి యాదో అంటూ నేడు సాయంత్రం విడుదల కి సిద్దం అయింది. అయితే దీనికి గోవింద్ వసంత సంగీత అందించారు. థింక్ మ్యూజిక్ ద్వారా ఆడియో విడుదల కానుంది. అయితే నెట్ ఫ్లిక్స్ ద్వారా ఈ వెబ్ సిరీస్ ఆగస్ట్ 6 న విడుదల కానుంది. తమిళం లో మాత్రమే కాకుండా తెలుగు తో పాటు పల భాషల్లో విడుదల కానుంది.



## 'రాక్షసుడు 2' లో నటించే స్టార్ హీరో అతనేనా..?

తమిళంలో సూపర్ హిట్ అయిన 'రాక్షసన్' చిత్రాన్ని తెలుగులో "రాక్షసుడు" పేరుతో రీమేక్ చేసిన సంగతి తెలిసిందే. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా రమేష్ వర్మ దర్శకత్వంలో ఈ సినిమా రూపొందింది. కోనేరు సత్యనారాయణ నిర్మించిన ఈ చిత్రం తెలుగులో కూడా ఘన విజయం సాధించింది. ఈ నేపథ్యంలో ఇప్పుడు దర్శకుడు సొంతగా కథ రెడీ చేసుకొని 'రాక్షసుడు' చిత్రానికి సీక్వెల్ చేయాలని సంకల్పించారు. "రాక్షసుడు 2" చిత్రానికి సంబంధించిన అనౌన్స్ మెంట్ పోస్టర్ ని విడుదల చేసి 'హోల్డ్ యువర్ బ్రీత్' అంటూ ఆసక్తిని కలిగించారు. అయితే ఈ సినిమాలో నటించబోయే హీరో ఎవరనేది ప్రకటించలేదు.'రాక్షసుడు 2' చిత్రంలో ఓ స్టార్ హీరో నటించబోతున్నాడని మేకర్స్ ప్రకటించారు. దీంతో ఈ సినిమాలో నటించే ఆ స్టార్ హీరో గురించి సోషల్ మీడియాలో అనేక వార్తలు వస్తున్నాయి. అయితే మేకర్స్ చెప్పిన ఈ ప్రముఖ హీరో టాలీవుడ్ కు చెందిన వ్యక్తి కాదంట. తమిళం నుంచి దిగుమతి చేసుకోబోతున్నారట. దీని కోసం మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి – శివ కార్తికేయన్ వంటి హీరోల పేర్లను పరిశీలించిన మేకర్స్.. సేతుపతి వైపే మొగ్గు చూపారని టాక్ వినిపిస్తోంది. నేషనల్ అవార్డ్ విన్నింగ్ యాక్టర్ విజయ్ సేతుపతి కి ఇప్పుడు భాషతో సంబంధం లేకుండా దేశవ్యాప్తంగా మంచి ఫాలోయింగ్ ఉంది.'పిజ్జా' 'పేట' వంటి డబ్బింగ్ సినిమాలతో తెలుగు ప్రేక్షకులను పలకరించిన విజయ్ సేతుపతి.. 'సైరా నరసింహా రెడ్డి' సినిమాలో చిన్న పాత్రలో కనిపించాడు. ఈ క్రమంలో 'ఉప్పెన' చిత్రంలో ప్రతినాయకుడిగా నటించి మెప్పించారు. ఈ నేపథ్యంలో "రాక్షసుడు 2" చిత్రాన్ని తెలుగు తమిళ బైలింగ్విల్ గా రూపొందించాలని ప్లాన్ చేసిన మేకర్స్.. సేతుపతి ని లీడ్ రోల్ కోసం సంప్రదించారట. రమేష్ వర్మ చెప్పిన కథ నచ్చడంతో.. వర్సటైల్ యాక్టర్ పాజిటివ్ సిగ్నల్ ఇచ్చారని టాక్ నడుస్తోంది. ప్రస్తుతం విజయ్ సేతుపతి వరుస ప్రాజెక్ట్స్ తో ఏడాది పొడవునా బిజీ షెడ్యూల్స్ ప్లాన్ చేసుకున్నారు. డేట్స్ అడ్జస్ట్ చేయలేక పలు పాన్ ఇండియా చిత్రాలను ఆయన వదులుకోవాల్సి వచ్చింది. మరి ఇప్పుడు 'రాక్షసుడు 2' కోసం సేతుపతి డేట్స్ అడ్జస్ట్ మెంట్ చేసుకొని గ్రీన్ సిగ్నల్ ఇస్తారేమో చూడాలి. ఒకవేళ విజయ్ సేతుపతి 'రాక్షసుడు' సీక్వెల్ లో భాగం అయితే మాత్రం.. ఇది క్రేజీ ప్రాజెక్ట్ అవుతుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు.రమేష్ వర్మ ప్రస్తుతం మాస్ మహారాజ రవితేజ తో 'ఖిలాడి' సినిమా పనుల్లో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తైన తర్వాత "రాక్షసుడు 2" సినిమా ప్రారంభం కానుంది. 'రాక్షసుడు' చిత్రం కోసం పని చేసిన సాంకేతిక బృందం మొత్తం 'రాక్షసుడు 2' లో భాగం అవుతున్నారు. ఎ స్టూడియోస్ సమర్పణలో హవిష్ ప్రొడక్షన్ బ్యానర్ పై సత్యనారాయణ కోనేరు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. గిబ్రాన్ సంగీతం సమకూరుస్తున్న ఈ చిత్రానికి వెంకట్ సి దిలీప్ సినిమాటోగ్రఫీ అందించనున్నారు. రాక్ స్టార్ దేవి శ్రీ ప్రసాద్ తమ్ముడు సాగర్ మరియు శ్రీకాంత్ విస్సా కలిసి ఈ చిత్రానికి సంభాషణలు రాస్తున్నారు. ఫైట్ మాస్టర్స్ రామ్ – లక్ష్మణ్ యాక్షన్ కొరియోగ్రఫీ చేయనున్నారు. దర్శకుడు రమేష్ వర్మ ఈ చిత్రానికి కథ – స్క్రీన్ ప్లే అందిస్తున్నారు. ఈ సినిమా ఎలాంటి సంచనాలు క్రియేట్ చేయబోతుందో చూడాలి.

# బెంగాల్లో అడుగు పెట్టిన 'అన్నయ్య'.. రజనీ క్రేజీ అప్డేట్!



కోలీవుడ్ సూపర్ స్టార్ రజనీకాంత్ అప్ కమింగ్ మూవీ అన్నాతే (అన్నయ్య). ప్రముఖ దర్శకుడు శివ తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ నిర్మిస్తోంది. ఈ ప్రతిష్టాత్మక చిత్రం కోసం ఫ్యాన్స్ ఎంతగానో ఎదురు చూస్తున్నారు. ఎన్నో అవాంతరాల నడుమ.. ఆగుతూ సాగుతున్న ఈ చిత్ర షూటింగ్ ఎట్టకేలకు తుది దశకు చేరుకుంది. ఈ మూవీ షూటింగ్ ఆల్మోస్ట్ కంప్లీట్ అయ్యింది. ప్యాచ్ వర్క్ కొన్ని సీన్స్ మాత్రమే బ్యాలెన్స్ ఉన్నాయి. ఇవి ఫినిష్ చేసేందుకు ఫైనల్ షెడ్యూల్ ను ప్లాన్ చేశారు మేకర్స్.ఇందుకోసం వెస్ట్ బెంగాల్ రాజధాని కోల్ కతా లో ల్యాండ్ అయ్యింది యూనిట్. ఈ షెడ్యూల్ నేటి నుంచే ప్రారంభం కాబోతోంది. ఈ షెడ్యూల్ కోసం ప్రధాన తారాగణం మొత్తం బెంగాల్లో దిగింది. ఈ మూవీలో ఎంత మంది స్టార్లు నటిస్తున్నారో తెలిసిందే. రజనీతోపాటు జగపతి బాబు ఖుష్బూ నయన తార కీర్తి సురేష్ వంటి స్టార్లు ఇందులో నటిస్తున్నారు.వాస్తవానికి ఈ సినిమా షూట్ ఎప్పుడో కంప్లీట్ కావాల్సింది. కానీ.. రజనీ పొలిటికల్ ఇష్యూ హైదరాబాద్ లో అనారోగ్యానికి గురవడం వంటి కారణాలతో చాలా డిలే అయ్యింది. ఆ మధ్య షూటింగ్ మళ్లీ మొదలై కొంత కంప్లీట్ చేశారు. ఇటీవల రజనీకాంత్ మళ్లీ అమెరికా వెళ్లొచ్చారు. రెగ్యులర్ హెల్త్ చెకప్ లో భాగంగా వెళ్లొచ్చిన తలైవా.. ఇప్పుడు పూర్తి ఫిట్ గా ఉండడంతో.. షూటింగ్ మొదలు పెట్టేశారు.ఈ ఫైనల్ షెడ్యూల్ ద్వారా బ్యాలెన్స్ మొత్తం కంప్లీట్ చేసి గుమ్మడి కాయ కొట్టేయాలన్నది యూనిట్ ప్లాన్. ఆ తర్వాత పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ మీద కూర్చోబోతున్నారు. వచ్చే నవంబర్ నాటికి అన్నీ పూర్తిచేసుకొని దీపావళి కానుకగా ఈ సినిమా రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారు. కాగా.. అదే రోజు కమల్ హాసన్ విక్రమ్ కూడా విడుదల చేయాలని చూస్తున్నట్టు సమాచారం. మరి ఏం జరుగుతుందన్నది చూడాలి.

# నేను ఓపెన్ బుక్ లా ఉన్నాను!:అమలా పాల్





నా వ్యక్తిగత జీవితాన్ని నా పని జీవితం నుండి వేరు చేసే పనిలో ఉన్నాను. అదే నేను ప్రాక్టీస్ చేస్తున్న కళ. నేను చాలా స్పృహాతో ఓపెన్ బుక్ లా ఉన్నాను అని అన్నారు అమలాపాల్. 17ఏళ్ల వయసులో పరిశ్రమకు వచ్చిన పాల్ 12ఏళ్ల కెరీర్ ని దిగ్విజయంగా పూర్తి చేశారు. తన జీవితం తనకు చాలా నేర్పించిందని తాజా చిట్ చాట్ లో అన్నారు. అమలాపాల్ నటించిన కుడి ఎడమైతే వెబ్ సిరీస్ త్వరలో ఆహా ఓటీటీలో రిలీజ్ కి రానుంది. ఈ సందర్భంగా తన వ్యక్తిగత విషయాలపైనా అమలాపాల్ చాలా ఆసక్తికర విషయాలను వెల్లడించారు. దశాబ్దం పాటు సౌత్ లో కథానాయికగా ఓ వెలుగు వెలిగిన అమలాపాల్ ఇంతకు ముందు దర్శకుడు ఎఎల్ విజయ్ ను వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే. కానీ కలతల వల్ల ఈ జంట విడిపోయారు. ప్రజలు తన వ్యక్తిగత జీవితంపై నిరంతరం ఆసక్తిని ప్రదర్శించడంపైనా అమలాపాల్ స్పందించారు. దానిని ఎలా ఎదుర్కోవాలో నేర్చుకున్నానని అన్నారు. నేను వెనక్కి తిరిగి చూసినప్పుడు దాని గురించి నాకు చెడుగా అనిపిస్తుంది. కానీ ఈ విషయాలపై నాకు నియంత్రణ లేదని అర్థం చేసుకునే జ్ఞానం కూడా నాకు ఉంది. ఇలాంటి వాటిపై నియంత్రణ లేకపోయినా.. జీవితంలో మనోహరంగా ముందుకు సాగగలను. ఇది కూడా ఈ ఉద్యోగంలో భాగమని నేను అర్థం చేసుకున్నాను. నాకు ఒక సామాజిక బాధ్యత ఉంది. సంఘంలో నేను మాత్రమే కాదు. చాలా ఉన్నాయి అని అమలాపాల్ తెలిపారు. నాకు లైఫ్ కి సంబంధించి ఇంతకుముందు తెలియని ఎంపిక ఉందని నేను గ్రహించాను. ఇప్పుడు నా వ్యక్తిగత జీవితాన్ని నా పని జీవితం నుండి వేరుచేసే పనిలో ఉన్నాను. అదే నేను ప్రాక్టీస్ చేస్తున్న కళ అని అమలాపాల్ అన్నారు.నేను ఎప్పుడూ అనుభవించక ముందు .. నా జీవితంలో ఏం జరుగుతుందనే దాని గురించి నేను చాలా ఓపెన్ గా ఉన్నాను. ఇప్పుడు నేను దానిని పంచుకునే ఆత్మను కావచ్చు..నా ఉద్దేశంపై నాకు క్లారిటీ ఉందని కూడా అమలాపాల్ తెలిపారు. ప్రతి ఒక్కరూ వారి జీవితంలోని వివిధ దశలలో వెళతారు. నేను దానిని ఎలా గ్రహించాలో వారు అర్థం చేసుకోగలరని నేను ఆశిస్తున్నాను. నేను నా జీవితంలో ఆ దశకు చేరుకున్నాను. అక్కడ నేను అంతగా ప్రతిదీ మీతో పంచుకోలేకపోతున్నాను అని చెప్పారు. కుడి ఎడమైతే సిరీస్ లో దుర్గా అనే పోలీస్ అధికారి పాత్రలో అమలాపాల్ నటించనున్నారు. మునుపటి కాలంలో మాదిరిగా తాను కఠినంగా ఉండటానికి వ్యతిరేకంగా తాను ఈ పాత్రను అప్రయత్నంగా పోషించానని అమలాపాల్ చెప్పారు. నా పాత్ర అతి ధోరణిని కలిగి ఉంటుంది. నా పాత్రలతో నేను చాలా ఎక్కువ ప్రయోగాలు చేస్తున్నాను. అప్రయత్నంగా ఎలా చేయగలనో అని దీని గురించి ఆలోచించాను ఆమె చెప్పింది.గత సంవత్సరం లాక్ డౌన్ సమయంలో చాలా ఆత్మపరిశీలన చేసుకున్నాను.. నాలోని కళాకారిణిని నేను అనుసరించాలని అనుకున్నాను. నాకు దుర్గా పాత్ర తెలుసు.. చాలా స్క్రిప్ట్ రీడింగ్ సెషన్లలో పాల్గొన్నాను. నాకు దుర్గ ఉద్యోగం.. ఆర్థిక పరిస్థితి గురించి తెలుసు అని తెలిపారు. ఇటీవల తన తండ్రిని కోల్పోయాక తన మానసిక స్థితి గురించి అమలాపాల్ ఈ ఇంటర్వ్యూలో వెల్లడించారు.

Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printing at :SEHASAI PRINTERS, D. 3-88, CHANRA TEATRE, GOSALA MAIN ROAD PENAMALURU MANDAL, DIST KRISHNA , ANDHRAPRADESH.,Published at H.No. 5+-61-3,Rajendra Nagar,Seetham peta, Visakha patnam-16,Andhrapradesh,India. Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com